



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 250 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 15 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :250 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 15 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల



- 9,990 మంది పరీక్షలు రాయగా 9,320 ఉత్తీర్ణులైనట్లు లోకేశ్ వెల్లడి
- ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా నమోదు
- అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ర్యాంకు కార్డులు
- వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు

పెన్ పవర్ డెస్క్:ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీఈసెట్-2026 ఫలితాలు విడుదలయ్యా యి. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమ వేదికల ద్వారా వీటిని

- మిగతా 2లో



## వైసీపీ హయాంలో జనాల కష్టాలను పట్టించుకోలేదు

- మినీ మహానాడులో పెమ్మసాని కీలక వ్యాఖ్యలు
- వైసీపీ హయాంలో ప్రజా వ్యతిరేకత పెరిగిందని వ్యాఖ్య
- గుంటూరును అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:గుంటూరు వేదికగా జరిగిన టీడీపీ మినీ మహానాడులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

- మిగతా 2లో

## ఎస్సై అరెస్టుతో బయటపడిన "అండదండల" రాజకీయం






**పెన్ పవర్ ఎపిసోడ్ - 2లో:**

- అసలు తిమింగలం ఎక్కడ..? రాజకీయ శక్తులు ఎవరు?
- సెటిల్మెంట్ బ్యాచ్ అసలు నాయకత్వం ఎవరి చేతుల్లో?
- మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కీలక వ్యక్తులు ఎవరు?
- గూడెంలో ప్రభుత్వ శాఖల్లో మరిన్ని తిమింగలాలు..?
- పోలీస్--రాజకీయ--మధ్యవర్తుల లింకులు ఏమిటి?
- పోలీస్ శాఖలో అసలు అవినీతి తిమింగలం ఎవరు.?

మరిన్ని సంచలన వివరాలతో... పెన్ పవర్ ఎపిసోడ్ -2 లో...!

- సెటిల్మెంట్ వ్యవహారాల్లో మధ్యవర్తుల పాత్రపై అనుమానాలు
- మధ్యవర్తుల వ్యవస్థలో మీడియా ప్రతినిధుల ప్రస్తావన -- చర్చనీయాంశం
- కేసుల పరిష్కారంలో "ఇంటర్మీడియరీ నెట్‌వర్క్" ఉందా?
- సెటిల్మెంట్ దందాలో బయటకు రాని కీలక మధ్యవర్తులపై దృష్టి?
- ఏసీబీ అధికారులను అడ్డుకునేందుకు పదుల సంఖ్య లో రాజకీయ నేతల హడావిడి?
- తాడేపల్లిగూడెంలో అసలు దందా పరిమాణంపై సంచలన చర్చ

ఎడిటర్, పెన్ పవర్ క్రైమ్ స్పెషల్ - తాడేపల్లిగూడెం,

తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై నాగరాజు ఏసీబీకి చిక్కిన ఘటన కొత్త మలుపులు తిరుగుతోంది. లంచం కేసులో పట్టుబడ్డ ఎస్సైను ఏసీబీ అధికారులు తీసుకెళ్లకుండా అడ్డుకునేందుకు స్థానికంగా పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు, అనుచరులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

వివరాలు 2లో..




## సీఎం విజయ్ కీలక నిర్ణయం.. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం పెంపు
- డీఏను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన విజయ్ సర్కార్
- ఈ నిర్ణయంతో 16 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
- ప్రభుత్వంపై ఏటా రూ.1,230 కోట్ల అదనపు భారం
- 2026 జనవరి 1 నుంచే ఈ పెంపు వర్తింపు

- మిగతా 2లో





## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

- స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలన్న కవిత
- స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన ఎండీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో చైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ

- మిగతా 2లో



## కేరళ రాజకీయాల్లో ఉత్కంఠకు తెర.. నూతన సీఎంగా వీడీ సతీశన్ ఎంపిక

పెన్ పవర్ డెస్క్:కేరళ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్‌ను ఎంపిక చేస్తూ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు దీప్‌దాస్ మున్షీ, ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్

- మిగతా 2లో

### పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్...

## ఘనస్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు

- శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్
- పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన టీడీపీ నేతలు
- ధర్మవరం బత్తలపల్లిలో లోకేష్‌కు బ్రహ్మరథం పట్టిన కార్యకర్తలు
- కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించి, వారితో ఫోటోలు దిగిన మంత్రి
- ఆర్డీటీ ఆసుపత్రి సందర్శన, అనంతపురం నేతలతో సమన్వయ సమావేశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల సందడి వాతావరణం నెలకొంది. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రతిఒక్కరినీ మంత్రి లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఉత్సాహంగా ఫోటోలు దిగారు. ఈ క్రమంలో పలువురు కార్యకర్తలు ఆయనకు తమ సమస్యలు, స్థానిక పరిస్థితులను వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. వారి నుంచి వినతులను స్వీకరించిన లోకేష్, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి లోకేష్ ధర్మవరం నియోజకవర్గానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బత్తలపల్లి సెంటర్‌లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో

- మిగతా 2లో



## తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో భేటీ అయిన కొడాలి నాని

- ఒకే ఒక్క ఫొటోతో రూమర్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన కొడాలి నాని
- పార్టీ మారతారన్న ప్రచారానికి ఫొటోతో సమాధానం
- ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేతో ఆలయాల సందర్శనతో పెరిగిన ఊహాగానాలు
- పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించినట్లు వెల్లడి
- తాను వైసీపీలోనే కొనసాగుతానని స్పష్టమైన సంకేతం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొడాలి నాని తన రాజకీయ భవిష్యత్తుపై కొంతకాలంగా జరుగుతున్న ప్రచారా నికి ఒక్క ఫొటోతో తెరదించారు. ఆయన బీజేపీలో చేరబోతు న్నారంటూ వచ్చిన వార్తలకు

- మిగతా 2లో

## ఆకాశంలో అల్లకల్లోలం.. యూపీలో ఒక్కరోజే 89 మంది మృతి



పెన్ పవర్ డెస్క్: మండువేసవిలో ఉత్తర్‌ప్రదేశ్ అకాల వర్షాలతో అతలాకుతలమైంది. తీవ్ర గాలి దుమారం, భారీ వర్షం సృష్టించిన పెనుబీభత్సం కారణంగా రాష్ట్రంలో నిన్న ఒక్కరోజే 89 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. క్యుములోనింబస్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసింది. "గాలి దుమారం, వడగళ్ల వాన, పిడుగుల కారణంగా మే 13న పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. దీంతో వేర్వేరు వర్ష సంబంధిత ఘటనల్లో 89 మంది మృతి చెందారు. మరో 53 మంది గాయపడ్డారు.

- మిగతా 2లో

## వారంలో ఒక రోజు 'నో వెహికల్ డే'... ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం

- "నా దేశం - నా బాధ్యత" పేరుతో ఏపీలో పొదుపు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం
- మంత్రులు, ఎమ్మెల్యేలు కాన్వాయ్‌లు, విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని సీఎం ఆదేశం
- వారానికి ఒక రోజు 'నో వెహికల్ డే', సైకిళ్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచన
- బంగారం కొనుగోళ్లు తగ్గించి, స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని పిలుపు
- ఇది భయపెట్టడానికి కాదు, సంక్షోభాన్ని ఎదుర్కొనే ముందుజాగ్రత్త చర్య అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం – నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని,

- మిగతా 2లో

## రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'... ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం

- రాయలసీమను డి హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ భారీ అడుగులు
- పుట్టపర్తిలో రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- డ్రోన్, డిఫెన్స్ రంగాల్లో మరో 12 కంపెనీల ప్రాజెక్టులకు శ్రీకారం
- వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### ఏం చేద్దాం.. మళ్లీ రూపాయి ధమాల్..!

దేశీయ ఆర్థిక ముఖచిత్రంపై మరోసారి ఆందోళన మేఘాలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం భారత కరెన్సీపై తీవ్రంగా పడింది. గత కొన్ని రోజులుగా ఊగిసలాటలో ఉన్న భారత రూపాయి విలువ గురువారం భారీగా క్షీణించి.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ఒక అమెరికన్ డాలర్‌కు రూపాయి విలువ రూ.95.88 వద్ద ట్రేడవుతోంది. కేవలం ఈ ఒక్క వారంలోనే రూపాయి విలువ దాదాపు 1.4 శాతం మేర పతనం కావడం ఆర్థిక వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.

**పతనానికి దారితీసిన ప్రధాన కారణాలు**

రూపాయి ఇంతలా కుదేలు కావడానికి అంతర్జాతీయ మార్కెట్లో పలు ప్రతికూల అంశాలు ఏకకాలంలో దాడి చేయడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్త పరిస్థితుల వల్ల సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 106 డాలర్లకు చేరింది. భారత్ తన చమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. చమురు ధర పెరిగినప్పుడల్లా భారత్ భారీగా డాలర్లను ఖర్చు చేయాల్సి వస్తోంది, ఇది రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటం, వడ్డీ రేట్లపై నెలకొన్న స్పష్టతతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలపడుతోంది. డాలర్ బలపడిన ప్రతిసారి వర్ధమాన దేశాల కరెన్సీలు, ముఖ్యంగా రూపాయి వంటివి బలహీనపడటం సహజంగా మారుతోంది. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను భారీగా వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి విలువను తగ్గించేలా చేస్తోంది.

**సామాన్యుడిపై భారాల జడివాన**

రూపాయి పతనం కేవలం గణాంకాలకే పరిమితం కాదు.. ఇది ప్రతి సామాన్యుడి జేబుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దిగుమతి చేసుకునే ముడి చమురు ఖరీదు పెరగడం వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి, తద్వారా కూరగాయలు, పప్పు ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్ విడిభాగాలు, చిప్‌లు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల ధరలు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా, యూరప్ దేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది పెను భారమే. ఫీజులు చెల్లించడానికి ఇప్పుడు గతంలో కంటే ఎక్కువ రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకునే వారికి కూడా ఖర్చులు తడిసి మోపెడవుతాయి.

**ఎగుమతిదారులకు 'కొంత' ఊరట**

ఈ సంక్షోభ సమయంలో కేవలం ఎగుమతి రంగాలకు మాత్రమే సానుకూల ఫలితాలు దక్కే అవకాశం ఉంది. ఐటీ , ఫార్మా, టెక్స్టైల్స్ వంటి రంగాలు తమ సేవలను విదేశాలకు విక్రయించి డాలర్లలో ఆదాయాన్ని పొందుతాయి. రూపాయి బలహీనపడటంతో ఆ డాలర్లను రూపాయల్లోకి మార్చినప్పుడు వారికి అధిక లాభాలు వస్తాయి. అయితే ముడి సరుకును దిగుమతి చేసుకుని ఎగుమతి చేసే పరిశ్రమలకు మాత్రం ఈ ప్రయోజనం పెద్దగా ఉండకపోవచ్చు.

**ఆర్బీఐ ఏం చేయబోతోంది?**

రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అప్రమత్తమైంది. తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల ద్వారా మార్కెట్లో డాలర్లను విక్రయించి, రూపాయి విలువ మరీ పడిపోకుండా 'జోక్యం' చేసుకునే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గి, చమురు ధరలు అదుపులోకి వస్తే తప్ప రూపాయికి తక్షణ ఉపశమనం లభించడం కష్టమని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశ ఆర్థిక మూలస్తంభాలు బలంగా ఉన్నప్పటికీ బాహ్య కారణాలు రూపాయిని కుంగదీస్తున్నాయి. రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం పెరగకుండా ప్రభుత్వం, ఆర్బీఐ ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.

## వారంలో ఒక రోజు 'నో వెహికిల్ డే'... ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

**ప్రజాప్రతినిధుల నుంచే మార్పు మొదలవ్వాలి..**

ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు. వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**ప్రజలకు, రైతులకు కీలక విజ్ఞప్తులు**

ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు.

ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచించారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు. అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**ముందు జాగ్రత్తే కానీ, భయం వద్దు**

ఈ చర్యలన్నీ ప్రజలను భయపెట్టడానికి కాదని, కేవలం సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజాన్ని సన్నద్ధం చేయడానికేనని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. "రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి తప్ప, ఆదాయం తగ్గిపోతుందని ఆలోచించకూడదు. దేశ ప్రయోజనాలే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు వల్ల రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గవచ్చనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఇతర మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందని, త్వరలోనే రాష్ట్రానికి రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ పొదుపు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐడపీఆర్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

## ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

- మొదటి పేజి తరువాయి

విడుదల చేశారు. 9,990 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 9,320 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా ఉంది.

**ర్యాంకు కార్డులు అధికారిక వెబ్ సైట్**

https://cets.apsche.ap.gov.in/PGECET/PGECET/PGECET_HomePage.aspxలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టిక్కెట్ నెంబర్‌లను ఎంటర్ చేసి ఫలితాలు తెలుసుకోవచ్చు. ఈ పోర్టల్ నుంచి ఫలితాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఏపీ పీజీఈసెట్–2026లో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు.

# ఎస్సై అరెస్టుతో బయటపడిన "అండదండల" రాజకీయం

- 2 పేజి తరువాయి

స్థానిక వర్గాల సమాచారం ప్రకారం... దాదాపు పదుల సంఖ్యలో రాజకీయ కార్యకర్తలు, మధ్యవర్తులు, అనుచరులు స్టేషన్ పరిసరాల్లో గుమికూడినట్లు ప్రచారం సాగుతోంది.

దీంతో...

**"ఒక సాధారణ ఎస్సై కోసం ఇంత స్థాయిలో రాజకీయ రక్షణ ఎందుకు?"**

**అనే ప్రశ్న ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.**

"ఇంత అండ అంటే... వెనక ఎంత దందా?"

సాధారణంగా అవినీతి కేసుల్లో పట్టుబడిన అధికారులను రాజకీయంగా దూరం పెట్టడం జరుగుతుంటుంది. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

ఏసీబీ అధికారుల చర్యలను ప్రభావితం చేసేలా ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ప్రచారం కూడా వినిపిస్తోంది.

దీంతో...

సెటిల్మెంట్ వ్యవస్థలో రాజకీయ భాగస్వామ్యం ఉందా?

ఎవరి ప్రయోజనాలు దెబ్బతింటాయనే భయం?

ఎస్సై అరెస్టుతో బయటపడే పేర్లు ఎవరవి?

అనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

**"పోలీస్ స్టేషన్ చుట్టూ అసాధారణ హడావిడి"**

ఏసీబీ ట్రాప్ అనంతరం టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది.

కొంతమంది స్థానిక నాయకులు అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా... మరికొందరు "అత్యుత్సాహం" ప్రదర్శించినట్లు సమాచారం.

**ఈ వ్యవహారం చూసిన ప్రజలు...**

"ఒక ఎస్సై కోసం ఇంతమంది రంగంలోకి దిగితే... వెనక నడుస్తున్న దందా పరిమాణం ఎంత పెద్దదో అర్థం చేసుకోవచ్చు"

అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

**"సెటిల్మెంట్ నెట్‌వర్క్‌కు రాజకీయ కవచమా?"**

తాడేపల్లిగూడెంలో భూ వివాదాలు, ప్రేమ వ్యవహారాలు, పోలీస్ కేసులు, వ్యాపార తగాదాల పేరుతో భారీ సెటిల్మెంట్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి.

ఈ సెటిల్మెంట్ వ్యవస్థలో రాజకీయ నాయకులు, మధ్యవర్తులు, కొందరు స్థానిక ప్రభావశీలులు కలిసి పనిచేస్తున్నారన్న చర్చ ఇప్పుడు మరింత బలపడుతోంది.

**ఏసీబీ దర్యాప్తు ఎటు?**

ఏసీబీ అధికారులు ఇప్పుడు కేవలం రూ.70 వేల ట్రాప్ కేసుకే పరిమితం కాకుండా...

కాల్ డేటా

ఆర్థిక లావాదేవీలు

మధ్యవర్తుల పాత్ర

రాజకీయ సంబంధాలు

అక్రమ ఆస్తులు

వంటి అంశాలపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం.

**ప్రజల్లో పెరుగుతున్న డిమాండ్ :**

ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి...

"ఎవరైనా సరే వదలొద్దు" అంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

"చిన్న అధికారులను పట్టుకుని కేసు ముగించకుండా...

వెనక ఉన్న పెద్ద తిమింగలాలను కూడా బయటకు తీయాలి"

అంటూ తాడేపల్లిగూడెం ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు.సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు.

సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

## రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'... ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం

ఒకప్పుడు రత్నాలకు, ఆ తర్వాత ఉద్యాన పంటలకు నెలవైన రాయలసీమ, ఇప్పుడు దేశ రక్షణ రంగంలో కీలక భూమిక పోషించేందుకు సిద్ధమవుతోంది. స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి కేంద్రంగా నిలవనుంది. 'రతనాల సీమ'గా చరిత్రలో, 'ఉద్యాన సీమ'గా వర్తమానంలో నిలిచిన ఈ ప్రాంతం, భవిష్యత్తులో 'రక్షణ సీమ'గా సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రక్షణ, డ్రోన్ రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు రాయలసీమ వేదిక కానుంది. ఇందులో భాగంగా, శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఏఎంసీఏ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది

**పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు భూమిపూజ**

దేశ రక్షణ వ్యవస్థలో గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు పుట్టపర్తిలో పునాది రాయి పడనుంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. సుమారు రూ.15,803 కోట్ల భారీ బడ్జెట్‌తో, 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ప్రాజెక్టులో భాగంగా, భారతదేశపు మొట్టమొదటి 5వ తరం స్టెల్త్ మల్టీ–రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను అభివృద్ధి చేస్తారు. స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్, సూపర్ క్రూయిజ్ వంటి అత్యాధునిక సామర్థ్యాలు ఈ యుద్ధ విమానాల ప్రత్యేకత. కేవలం తయారీనే కాకుండా, వాటి టెస్టింగ్ కూడా పుట్టపర్తిలోనే చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 7,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికి అనుబంధంగా వచ్చే ఇతర పరిశ్రమల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని, దీనికోసం ప్రభుత్వం మరో 400 ఎకరాలు కేటాయించింది.

## ఆకాశంలో అల్లకల్లోలం.. యూపీలో ఒక్కరోజే 89 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

114 జంతువులు మరణించాయి. 87 ఇళ్లు ధ్వంసమయ్యాయి" అని యూపీ (ఖ్ఘుతీ ్రాతీఖుఁవంప్త్ర) రిలీఫ్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. ఈ అకాల వర్షాల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరాతీసినట్లు తెలిపింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించినట్లు పేర్కొంది.ప్రయాగ్‌రాజ్, భదోహి, సోన్‌భద్ర, ఫతేపూర్ తదితర జిల్లాల్లో బుధవారం గాలివాన బీభత్సం కొనసాగింది. ప్రయాగ్‌రాజ్‌లో 21 మంది, భదోహిలో 16, ఫతేపూర్‌లో 11, సంత్ రవిదాస్ నగర్‌లో 14, మీర్జాపూర్‌లో 10 మంది మృతి చెందినట్లు ఆయా జిల్లాల యంత్రాంగం వెల్లడించింది. ఈ జిల్లాల్లో అనేక చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.

**పెనుగాలి.. పిడుగులు**

సాధారణంగా మే నెలలో ఉత్తర భారతంలోని అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చాలాచోట్ల సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీల పైనే ఉంటుంది. ఆ సమయంలో భూఉపరితలంపై ఉండే గాలి విపరీతంగా వేడెక్కుతుంది. అది వేగంగా కదులుతూ ఇతర దిశల నుంచి తడిగాలిని లాగేసుకుంటుంది. ఈ రెండు కలిసి ఆకాశంలో చాలా ఎత్తుకు చేరినప్పుడు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. దట్టమైన నల్లటి మబ్బులు ఆకాశమంతా విస్తరిస్తాయి. ఆ తర్వాత తక్కువ సమయంలోనే భారీ వర్షం, వడగళ్లు, పిడుగులు పడుతాయి. ఇప్పుడు యూపీలో ఇలాంటి పరిస్థితే ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

**గాలికి ఎగిరిపడి..**

బరేలీ జిల్లాలో బలమైన ఈదురు గాలుల కారణంగా ఓ వ్యక్తి ఎగిరిపడ్డాడు. గాలిదుమారం రావడంతో సదరు వ్యక్తి ఓ షెడ్డును పట్టుకుని నిలబడ్డాడు.

అయితే గాలి తీవ్రతకు షెడ్డుతో సహా ఎగిరిపడ్డాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనలో గాయపడిన అతడికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## వైసీపీ హయాంలో జనాల కష్టాలను పట్టించుకోలేదు

- మొదటి పేజి తరువాయి

చంద్రశేఖర్ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక సంస్కృతి పెరిగిందని, జనం ఎదుర్కొంటున్న కష్టాలను ఆ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదని ఆయన ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి హృదయ స్పందన నుంచి పుట్టిన పార్టీ అని అభివర్ణించిన పెమ్మసాని, గత 40 ఏళ్లుగా చంద్రబాబు అత్యంత నిబద్ధతతో పార్టీని నడిపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

ముఖ్యంగా గుంటూరు అభివృద్ధిపై పెమ్మసాని కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీ అధికారాన్ని నిలబెట్టుకుంటే, గుంటూరు నగరాన్ని అమెరికా తరహాలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్

సెంటర్ల ద్వారా కార్యకర్తలు ఆర్థికంగా స్థిరపడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్...

## ఘనస్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు

- మొదటి పేజి తరువాయి

ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసందోహం మధ్య లోకేష్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఈ పర్యటనలో భాగంగా, మంత్రి లోకేష్ బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించనున్నారు. ఆ తర్వాత అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, ముఖ్య నేతలతో నిర్వహించనున్న సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం.

## తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో భేటీ అయిన కొడాలి నాని

- మొదటి పేజి తరువాయి

చెక్ పెడుతూ, బుధవారం తాడేపల్లిలోని నివాసంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశం తర్వాత ఆయన స్వయంగా సోషల్ మీడియాలో ఫొటోను పంచుకోవడంతో పార్టీ మార్పు చర్చకు ముగింపు పడినట్లయింది. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత కొడాలి నాని రాజకీయంగా పెద్దగా క్రియాశీలకంగా కనిపించలేదు. మధ్యలో అనారోగ్య సమస్యలతో ముంబైలో చికిత్స తీసుకుని కోలుకున్నారు. ఆ తర్వాత కూడా ఆయన గుడివాడ నియోజకవర్గానికి, ఏపీ రాజకీయాలకు కొంత దూరంగానే ఉన్నారు. ఈ క్రమంలో మార్చి నెలలో మహారాష్ట్రకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే మోహన్ మాతే కుటుంబంతో కలిసి శ్రీకాళహస్తి, తిరుమల, విజయవాడ కనకదుర్గ ఆలయాలను సందర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేతో కలిసి ఆయన ఆలయాలను దర్శించుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో కొడాలి నాని వైసీపీని వీడి, కాషాయ కండువా కప్పుకోవడం ఖాయమంటూ మీడియా, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.ఈ ఊహాగానాలకు సమాధానం ఇచ్చేలా కొడాలి నాని తాజా అడుగు వేశారు. జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశానని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చించామని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ భేటీతో తాను వైసీపీని వీడేది లేదని, తన ప్రయాణం జగన్ వెంటేనని ఆయన పరోక్షంగా స్పష్టమైన సంకేతాలు పంపారు. దీంతో ఆయన పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారానికి పూర్తిగా అడ్డుకట్ట పడింది.

## కేరళ రాజకీయాల్లో ఉత్కంఠకు తెర.. నూతన సీఎంగా వీడీ సతీశన్ ఎంపిక

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో కేరళ కాంగ్రెస్‌లో ఒక తరం మారిపోయిందని, కొత్త శకం ఆరంభమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సీఎం రేసులో ఉన్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా ఫోన్ చేసి, సతీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కూడా రాహుల్ సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. రోజుల తరబడి సాగిన తీవ్రమైన లాబీయింగ్, చర్చల తర్వాత హైకమాండ్ సతీశన్ వైపే మొగ్గు చూపింది.

**సతీశన్ రాజకీయ ప్రస్థానం**

కొచ్చి జిల్లాకు చెందిన 62 ఏళ్ల సతీశన్, వృత్తిరీత్యా న్యాయవాది. 2001లో పారావూర్ నుంచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. తన వాగ్ధాటి, గణాంకాలతో కూడిన ప్రసంగాలతో అసెంబ్లీలో అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడంలో ఆయనకు మంచి పేరుంది. కేరళ కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన 'ఏ', 'ఐ' వర్గాలకు అతీతంగా ఉండటం ఆయనకు కలిసివచ్చింది. ఇది యువ నాయకులను, కార్యకర్తలను ఆయన వైపు ఆకర్షించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా ప్రతిపక్ష నేతగా ఎంపికైన సతీశన్, ఆ పదవిని తన రాజకీయ ఎదుగుదలకు సోపానంగా మార్చుకున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, ఏఐ కెమెరాల ఆరోపణల వంటి అంశాలపై పినరయి విజయన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వామపక్ష వ్యతిరేక రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగారు. ఇప్పుడు ప్రతిపక్ష నేత స్థానం నుంచి ముఖ్యమంత్రి కుర్చీకి మారబోతున్న సతీశన్‌పై భారీ అంచనాలున్నాయి. కేవలం ప్రభుత్వాన్ని నడపడమే కాకుండా ఎన్నికల పరాజయాలతో నిస్తేజంగా మారిన పార్టీకి కొత్త ఊపునిచ్చి, వామపక్షాల ప్రాబల్యాన్ని ఎదుర్కోవాల్సిన పెద్ద బాధ్యత ఆయనపై ఉంది.

## సీఎం విజయ్ కీలక నిర్ణయం.. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం గురువారం శుభవార్త అందించింది. వారి కరవు భత్యాన్ని (డీఏ) 2 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో డీఏ 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు డీఏను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన నేపథ్యంలో, అదే ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది.ఈ డీఏ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.1,230 కోట్ల అదనపు భారం పడనుందని అధికారులు అంచనా వేశారు. అయినప్పటికీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది.ప్రభుత్వ తాజా నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల నుంచి ఇది కొంత ఉపశమనం కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. పెంచిన డీఏ, బకాయిల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం త్వరలో పూర్తిస్థాయి ఉత్తర్వులు జారీ చేయనుంది.

# మంత్రి నారా లోకేష్‌కు జనసేన నేత స్వాగతం

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ మే 14:** పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు అరకు జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మన్యం ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు తెలిపారు. ప్రాంత అభివృద్ధి, యువత ఉపాధి, గిరిజన ప్రాంతాల సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 73 వార్డ్ జీవీఎంసి ఎన్నికల ముఖ చిత్రం


సింగూరి ఆనంద్ 73వ వార్డ్ అధ్యక్షులు


బలగం బాలు నాయుడు క్లస్టర్ ఇంచార్జ్


నమ్మి సింహాద్రి టిడిపి నాయకులు


ప్రసాదుల శ్రీనివాసరావు గాజువాక సమన్వయకర్త

**విశాఖపట్నం :(స్టాఫ్ రిపోర్టర్ )పెన్ పవర్ ,మే 14** మహా విశాఖ నగర పాలక సంస్థ పార్టీలు సిద్ధంగా ఉన్నాయా అంటే అనుమానమే . వార్డ్ లో ప్రధాన పార్టీ టిడిపి నిర్లక్ష దొరణీ లో వ్యవహరిస్తున్న తీరు పలువురు నాయకులను అసహనానికి గురిచేస్తుంది . ముఖ్యం గా ద్వితీయ శ్రేణి నాయకులను విస్మరిస్తున్నారని విమర్శ లేకపోలేదు. పాత గాజువాక టిడిపి కార్యాలయం లో అంతా తానే అన్నట్లు ఒక వ్యక్తి ఎమ్మెల్యే బంధువు తీరు పలువురు నాయకులు ,కార్యకర్తలు ,పార్టీ అభిమానులు ,సామాజిక వర్గం నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు . 73 వార్డ్ జీవీఎంసీ ఎన్నికల్లో బరిలో టికెట్ ఆశిస్తున్న ఆశావాదులు లిస్ట్ పెద్దదే . పోటీకై పలువురు సిద్దంగా ఉన్నారు .73 వార్డ్ టిడిపి అధ్యక్షుడు సింగూరు అనంత్ రేసు లో ప్రధమ స్థానం లో ఉన్నాడు . వార్డ్ లో నిత్యం తిరుగుతూ ప్రజా సమస్య లు అధికారుల దృష్టి కి తీసుకెళుతూ సమస్య ల పరిష్కరిస్తున్నరు . సింహగిరి కాలనీ ,పైడిమాంబ కాలనీ మంచి పట్టుఉన్న నాయకుడు టీఎన్ టి యు సి కార్యదర్శి నమ్మి సింహాద్రి కార్మిక నాయకుడు గా సూపరచితడు పార్టీ కార్యక్రమలో చురుకుగా పాలుగోంటున్నాడు . వార్డ్ లో అందరికి సూపరచితుడు . టికెట్ ఆశిస్తున్నాడు . గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నాడు .

73 వార్డ్ ముఖ్య నాయకుడు యువ కెరటం బలగం బాలు నాయుడు పార్టీ టికెట్ కై ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాడు . వార్డ్ లో పట్టున్న నాయకుడు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటూ పలు సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొని వెళుతూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో ప్రజల అభిమానాన్ని చూర గొన్నాడాని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ వాళ్ళ సమస్యలను తెలుసుకుంటూ వార్డుల్లో కలియ తిరుగుతూ వాటి పరిష్కారానికి నేనున్నానంటూ ముందుకు వస్తున్న నాయకుడిగా వార్డులో మంచి పేరు పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు.

73 వ వార్డులో ఒక ప్రముఖ వ్యక్తి పదేపదే పోటీ చేస్తూ ఓటమిని పొంది బంగపడుతున్న మరల రాబోవు జీవీఎంసీ ఎలక్షన్కు రెడీ అయ్యాడని 2007లో టికెట్టు ఆశించి బంగపడిన ప్రసాదుల శ్రీను తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీ అభ్యర్థి అయిన పులిచెర్ల రాజేశ్వరికి ఎదురు నిలబడటం పార్టీ వ్యతిరేకతకు నిదర్శనం . 2007 ఎన్నికల ముఖచిత్రం చూస్తే తెలుగుదేశం పార్టీ తరపున పులిచర్ల రాజేశ్వరి , కాంగ్రెస్ పార్టీ తరుపున మూర్తి ,ఇండిపెండెంట్అభ్యర్థి ఏమిలి జ్వాల , రెబల్ అభ్యర్థిగా ప్రసాద శ్రీను నిలబడిన సంగతి అందరికీ తెలిసినదే ఓడిపోతానని సమాచారం పక్కాగా ఉండడంతో లోపాయికారిగా ఇండిపెండెంట్ అభ్యర్థి ఏమిలి జ్వాల కు మద్దతునిస్తూ ఏమిలి జ్వాల గెలుపుకు కారణయ్యాడనే అపవాదు ఉండనే ఉంది. పులిచెర్ల రాజేశ్వరిని దగ్గరుండి మరి ఓడించిన ఘనత ఈ మహానుభావుడుకే దక్కుతుంది పార్టీ అధిస్తానం గుర్రుగా ఉన్న సంఘతి అందరికీ తెలిసినదే . 2021 మహా విశాఖ నగరపాలక సంస్థ ఎన్నికల్లో మరల టికెట్ ఆశించి పైరవీలు చేసుకొని ఎలాగైనా మొత్తానికి 73 వ వార్డు కార్పొరేటర్ టికెట్టు తెలుగుదేశం తరపున అభ్యర్థిగా తన భార్య అయిన ప్రసాదుల సునీత పేరు మీద తెచ్చుకోని బరిలోకి దిగడం జరిగింది. 2021 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ తరపున భూపతిరాజు సుజాత,తెలుగుదేశం పార్టీ తరపున ప్రసాదుల సునీత, జనసేన పార్టీ తరపున గోవింద్ నిలబడడం జరిగింది ఎన్నికల పోటీ రసవత్తరం గా ఎంత ఉన్నదో లేదో తెలియదు గాని ప్రసాదు శ్రీను సామజిక వర్గం లో తీవ్ర వ్యతిరేకత ,గతం లో పార్టీ కి చేసిన వెన్నుపోటు భారీ ఓటమికి కారణభూతం అయింది . ఓటమి పై మదనపడకుండా , ఓటమిపై అంచనా వేసుకుంటూ ఏ విధంగా ఓడిపోయామని తెలుసుకొనడానికి ప్రయత్నించలేదు సరి కదా వార్డ్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా కేవలం తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి పరిమితమై పైరవీలు చేసుకుంటూ ఎవరైనా పని మీద వచ్చితే ముందు తన దగ్గరకు వచ్చి దర్శనం చేసుకోవాలని ముఖం జారీ చేస్తూ తన తర్వాతే ఎమ్మెల్యే అన్న తరహాలో వ్యవహరించడం . 2021 ఎన్నికల్లో పరాజయానికి మూల కారణం గత అనుభవంలో 2007లో జరిగిన అపోజిషన్ పార్టీకి మద్దతు ఇచ్చి సో పార్టీ మీద రెబల్గా నిలబడటం వారు జీర్ణించుకోలేక తమ సామాజిక వర్గంలోనే కొందరు నాయకులు దగ్గరుండి మరియు ఓడించార ని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే కార్యక్రమాలు చూడటం ఆఫీసును మొత్తం అంతా తానే నడిపిస్తున్నాను తానే లేకపోతే పార్టీ ఆఫీసు లేదని అన్న తీరుతో చందన వ్యవహరించడంతో పలమూరు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పలు కార్యక్రమాలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శాసనసభ్యుడి దగ్గరకు వెళ్లాలంటే ముందుగా ప్రసాదల శ్రీను దర్శనం చేసుకోవాలని తరహాలో తయారయింది . గతంలో ఒక సామేత చెప్పినట్టు దేవుడు వరమిచ్చిన పూజారి వరమియుడు అన్నట్టుగా అన్నట్టుగా తయారయింది తెలుగుదేశం పార్టీ గాజువాక తీరు మరల రాబోవు ఈవీఎంసీ ఎలక్షన్లలో మళ్లీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నాడని బోగట . గత అనుభవాలు దృష్టిలో పెట్టుకోని పార్టీ అధిష్టానం మరలా ఈయన సపోర్ట్ చేసిన వ్యక్తికి పార్టీ టికెట్ ఇస్తే డిపాజిట్ కూడా గల్లంతైపోతుందని స్థానికులు వ్యాఖ్యనిస్తున్నారు. వార్డుల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్య తిరుగుతున్న నాయకులు టికెట్ ఇస్తే గెలుస్తారని ఉదాహరణకు సింగురు ఆనంత్ , నమ్మి సింహాద్రి, బలగం బాలు నాయుడు తో పార్టీ ముందుకు దూసుకెళ్తూ తమ లక్ష్యానికి చేరుకుంటున్నారని పార్టీకి మంచి భవిష్యత్తు రావాలన్న యువత రంగాన్ని తీసుకురావాలని పలువురు రాజకీయ మేధావులు అభిప్రాయపడుతున్నారు. నిభందనలు ప్రకారం పార్టీ లోని వ్యక్తులకు నామినటేడ్ పదవి ఒక్క దని కె అర్హుడు కానీ విచిత్రం మన ప్రసాదులు కు గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయ కర్త , సివిల్ సప్లయ్ బోర్డ్ డైరెక్టర్ రెండు పదవులు వెలగబెడుతున్నాడు . వడ్డించిన వాడు మన వాడు అయితే చివరి బంతి అయిన పరవాలేదు అన్న చందాన ఉంది మన ప్రసాదుల తీరు . పలు ఆరోపణలు,విమర్శలు ఉన్నా ఎమ్మెల్యే దగ్గర బంధువు కావడంతో పార్టీ చర్యలు తీసుకోవడాని వెనుకడుతుంది అనే విమర్శ లేకపోలేదు.

# సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో గణపతి శర్మకు స్థానం

**కోటబొమ్మాళిలో ప్రముఖుల హర్షం**

**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** విశాఖపట్నం లోని ప్రముఖ పుణ్య క్షేత్రం సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నరసింహాస్వామి వారి దేవస్థానానికి ట్రస్ట్ బోర్డు ని చైర్మన్ గా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ని, సభ్యులు గా 16 మందిని ప్రభుత్వం నియమించింది. అలాగే టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండల కేంద్రానికి చెందిన సుసారపు గణపతి శర్మ ను ఫస్ట్ బోర్డు సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ ప్రాంతంలో పేరు ప్రతిష్టలతో పాటు నిత్య అన్నదానం చేస్తున్న ప్రముఖ వేద పండితులు సుసారపు వంశానికి చెందిన

సుసారపు చిరంజీవి కుమారుడు గణపతి శర్మ. గణపతి శర్మకి సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమించి కోటబొమ్మాలి గ్రామానికి ప్రాధాన్యత కల్పించినందుకు రాష్ట్ర కళింగ వైశ్య కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు మంత్రులు అచ్చన్న నాయుడు, రామ్మోహన్ నాయుడు లకు కృతజ్ఞతలు తెలిపారు

ఈ సందర్భంగా గణపతి శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం తనను గుర్తిస్తూ బాధ్యతలు అప్పగించినందుకు ప్రభుత్వానికి ఎటువంటి మచ్చ లేకుండా పనిచేస్తానని అన్నారు. ఈ కమిటీలో తనను సభ్యునిగా చేర్చేందుకు కృషిచేసిన మంత్రులు కింజరాపు అచ్చన్న నాయుడు, రామ్మోహన్ నాయుడుకు తాను ఎంతో రుణపడి



ఉంటానని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# జర్రిపడలో పిల్లలకు యోగ శిక్షణ కార్యక్రమం





- **8 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు నెలరోజులపాటు శిక్షణ కార్యక్రమం.**
- **యోగ కోచింగ్ ఇంచార్జ్ కుర్తాడి ప్రసాద్.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 14.** మండలంలో గల పెదగూడ పంచాయతీ, జర్రిపడలో 8 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు యోగ శిక్షణ నెలరోజుల పాటు నిర్వహిస్తున్నట్లు యోగ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జ్ ప్రసాద్ కుర్తాడి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అల్లూరి సీతారామరాజు జిల్లా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ డిఎస్ డి ఓ జగన్ మోహన్ రావు ఆదేశాల మేరకు యోగా ప్రాక్టీస్ ప్రతిరోజు జర్రిపడ గ్రామములో గల పాఠశాల వద్ద 8 నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రతిరోజు యోగ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ యొక్క శిక్షణ కార్యక్రమము మే1 నుండి మే 31 వరకు కొనసాగుతాయని ప్రసాద్ కుర్తాడి తెలిపారు. ప్రతి విద్యార్థికి చెక్కిళ్ళు ప్రతిరోజు ఉదయం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సీతారాం, లంబోధర్, బాబురావు, కేశవరావు, పిల్లల తల్లిదండ్రుల పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎంపీటీసీ పసుపులేటి నాగమణి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మే 14:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను గూడెంకొత్తవీధి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, గూడెంకొత్తవీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మన్యం ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్లు సమాచారం.






# పంట దిగుబడులను పెంచుటకు రైతులకు శిక్షణలు, వర్క్‌షాపులు నిర్వహించాలి

**పాడేరు, పెన్ పవర్, మే 14:** అధిక దిగుబడులు, ఉత్తమమైన నూతన సాగు పద్ధతులు అవలంబించడం, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా జిల్లాలో కాఫీ ఉత్పత్తిని గణనీయంగా పెంచగలమని శాఖల మధ్య సన్నాహక సమావేశంలో కేంద్ర కాఫీ బోర్డ్ సీఈవో, సెక్రెటరీ ఎం. కుర్మారావు తెలిపారు. జిల్లాలో కాఫీ దిగుబడులను పెంచేందుకు శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు.

గురువారం అరకు వ్యాలీ పున్నమి రిసార్ట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కాఫీ రైతులు, శాఖల మధ్య సమన్వయ సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంతి.టి మాట్లాడుతూ గ్రామస్థాయిలో వివిధ సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా, అధిక మొత్తంలో రైతులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండడం ద్వారా మెరుగైన ఆర్థిక ఫలితాలను పొందగలరని తెలిపారు.

జాతీయ కాఫీ బోర్డ్ చైర్మన్ ఎం.జె. దినేష్ మాట్లాడుతూ అధిక మొత్తంలో నాణ్యతతో కూడిన కాఫీ దిగుబడులను సాధించుటకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాఫీతో పాటు వివిధ సుగంధ ద్రవ్యాల పంటలు, ఉద్యానవన పంటలను జిల్లాలో ప్రోత్సహించడం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని, అందుకు అనుగుణంగా జిల్లా అధికారి యంత్రాంగం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయంతో పని చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్, బెంగళూరు డైరెక్టర్ తుషార్ కాంతి బెహరా సూచించారు.



రాష్ట్ర కాఫీ బోర్డు చైర్మన్ భార్గవి మాట్లాడుతూ రెండు లక్షల ఎకరాల్లో కాఫీ పంట విస్తరణకు సమగ్రమైన ప్రణాళికలు చేపట్టాలని జిల్లా అధికారి యంత్రాంగానికి సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కాఫీ, అనుబంధ పంటల ఉత్పత్తులను తయారుచేసి, మార్కెట్ ధర రైతులకు అందిస్తూ సుగంధ ద్రవ్యాల హబ్‌గా జిల్లాను మార్చాలన్నారు.

ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయుటకు సమగ్రమైన ప్రణాళికను రచిస్తామన్నారు. జీసీసీ ఎండీ శోభిక మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, జీవనాభివృద్ధికి గిరిజన సహకార సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ అధికారి బాబురావునాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, సీనియర్ లైజనింగ్ కాఫీ అధికారి రమేష్ బాబు, పాడేరు ఐటీడీఏ కాఫీ బోర్డ్ అధికారి బొంజి బాబు, జిల్లా సుగంధ ద్రవ్యాల బోర్డ్ అధికారిణి కళ్యాణి, వివిధ మండలాల నుంచి వచ్చిన ఉద్యాన శాఖ కన్సల్టెంట్లు, కాఫీ పరిశ్రమ ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చీపురుపల్లి వసతి విద్యార్థికి ఉత్తమ పురస్కారం..



**చీపురుపల్లి పెన్ పవర్ మే 14** :ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాలలో విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి సమీకృత వసతి గృహ విద్యార్థికి ఉత్తమ పురస్కారం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి సమీకృత వసతి గృహంలో 10వ తరగతి చదువుకుంటున్న దేవర ప్రసాద్ 566 మార్కులు సాధించి జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో ప్రథమ స్థానంలో చీపురుపల్లిని నిలపడం పట్ల ఈ నెల 12వ తేదీన అమరావతిలోని నిర్వహించిన ప్రత్యేక అభినందన సభలో వసగృహ నిర్వాహకులు ఆర్ సత్యనారాయణ తో పాటు విద్యార్థిని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత పురస్కరించారు. చిగురుపల్లి సమీకృత వసతి గృహం నుండి తొమ్మిది మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా ఐదుగురు ప్రథమ స్థానంలోనూ నలుగురు ద్వితీయ స్థానంలోనూ మార్కులను సాధించి నిలబడ్డారు. వీరిలో మెరకముడిదం మండలం సిరిదేవి పురం గ్రామానికి చెందిన దేవర ప్రసాద్ 566 మార్కులు 10వ తరగతిలో సాధించి జిల్లా సంక్షేమ వసతి గృహాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు వసతి గృహ నిర్వాహకులు సత్యనారాయణ అమరావతిలో జరిగిన ప్రత్యేక అభినందన సభకు హాజరై విద్యార్థితో పాటు పురస్కారాన్ని తీసుకున్నట్లు గురువారం నాడు వివరించారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవితా తో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ సత్యనారాయణ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ మల్లికార్జునరావు తదితర పెద్దలు పాల్గొన్నట్లు ఈ సందర్భంగా ఆయన వరించారు. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## అల్లూరి జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలి

నారా లోకేష్‌కు డాక్టర్ వంపూరు గంగులయ్య వినతి



**స్టాప్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, మే 14:** అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం -- అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య కోరారు. బుధవారం పాడేరు వచ్చిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అల్లూరి జిల్లాలోని అరకు, పాడేరు ప్రాంతాల్లో ఇప్పటికే నిరుద్యోగిత అధికంగా ఉందని, జోన్-1లో కొనసాగితే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. విశాఖపట్నంతో ఈ ప్రాంత గిరిజనులకు ఎన్నో ఏళ్లుగా ఉపాధి సంబంధాలు ఉన్నాయని, అధిక శాతం మంది ఉద్యోగాల కోసం అక్కడికే వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు జోన్-1లో ఉన్న జిల్లాను జోన్-2లోకి మార్చడం వల్ల స్థానిక యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం స్థాయిలో చర్చించి ఆదివాసీలకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## గుండెపోటుతో మాజీ సర్పంచ్ గడ్డవలస నాగు మృతి



**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** కోటబొమ్మాలి మండలం మాసాహెబ్ పేట పంచాయతీ మాజీ సర్పంచ్, కమలనాభపురం కు చెందిన గడ్డ వలస నాగభూషణరావు (55) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఆకస్మికంగా చాతిలో నొప్పి రావడంతో మిత్రులు శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే నాగభూషణరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నాగభూషణరావు రాజకీయ ప్రస్థానంలో అన్ని పార్టీల కార్యకర్తలు, నేతలతో కలగలుపుగా ఉండేవాడు. మృతుడుకి భార్య సాయమ్మ, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఇందులో పెద్ద కుమార్తెకు వివాహం జరిగింది. చిన్న కుమార్తె ఉన్నత విద్యను అభ్యసిస్తుంది. భార్య సాయమ్మ అంగన్వాడీ కార్యకర్తగా కొనసాగుతున్నారు. ఈయన వై.సి.పి మాజీ జే.ఏ.సి కన్వీనర్ గా కూడా వ్యవహరించారు. ఈయన మృతి పట్ల వై.సి.పి రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యక్షుడు నూక సత్యరాజు, వై.సి.పి జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, నియోజకవర్గ బీ.సీ సెల్ అధ్యక్షుడు పేడాడ వెంకటరావు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సింగుపురపు వినోద్ కుమార్, రైతు విభాగం అధ్యక్షుడు బగాధి దివాకర్, పలువురు నేతలు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## హుండీ ఆదాయం 3.70.000...



**చీపురుపల్లి పెన్ పవర్ మే 14** :విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మరియు గ్రామం నందు వేంచేసియున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం యొక్క హుండీల ఆదాయం మూడు లక్షల 70 వేల రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎస్ నానాజీ బాబు గురువారం తెలిపారు. జి శ్యామ్ ప్రసాద్ , తనిఖీదారు, దేవాదాయ ధర్మాదాయ శాఖ,విజయనగరం వారి సమక్షంలో దేవాలయం వద్ద తెరచి లెక్కించగా హుండీల ఆదాయాన్ని గుర్తించమన్నారు. ఈ ఏడాది 25.02.2026 ది నుండి తే 14.05.2026 ది వరకు రూ3,70,000/రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గవిడి. నాగరాజు , పొట్నూరు త్రినాథ రావు, లెంక.చిన్నారావు , అద్దూరి.భారతి, భక్తులు గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో మన్యం విద్యార్థుల ప్రభంజనం.

**చింతపల్లి ఈఎంఆర్ఎస్ టాపర్‌గా తన్విత.**

**90.2 శాతం మార్కులతో సత్తా చాటిన గిరి పుత్రిక.**



**చింతపల్లి పెన్ పవర్ మే 14.** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన విద్యార్థిని పాంగి తన్విత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బుధవారం విడుదల చేసిన 12వ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో (ఈఎంఆర్ఎస్) బైపీసీ చదువుతున్న ఈమె, సైన్స్ విభాగంలో 90.2 శాతం మార్కులతో పాఠశాల స్థాయిలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటింది. ప్రధాన ఐదు సబ్జెక్టులకు గాను 500 మార్కులకు తన్విత ఏకంగా 451 మార్కులు సాధించింది. మారుమూల గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన ఓ విద్యార్థిని ఇంతటి అద్భుతమైన విజయం సాధించడం పట్ల చింతపల్లి ఈఎంఆర్ఎస్ పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తమ కుమార్తె అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో ఆమె తల్లిదండ్రులు సత్యవేణి, సురేష్ కుమార్ (స్థానిక పాత్రికేయుడు) దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ఘనతను పురస్కరించుకుని వారు తమ ఇంటి వద్ద కేక్ కట్ చేసి బంధుమిత్రులతో కలిసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఎలాంటి ఆధునిక వసతులు లేని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు తన్విత సాధించిన ఈ విజయం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు స్థానికులు కొనియాడారు. భవిష్యత్తులో వైద్య రంగంలో అడుగుపెట్టి అత్యుత్తమ వైద్యురాలిగా రాణించాలన్నదే తన లక్ష్యమని ఈ సందర్భంగా తన్విత తెలిపింది. తాను ఈ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించడానికి పాఠశాలలో ఉపాధ్యాయులు అందించిన నాణ్యమైన బోధన, శిక్షణే కారణమని ఆమె పేర్కొంది. తన లక్ష్య సాధన దిశగా అడుగడుగునా ప్రోత్సహిస్తూ అండగా నిలిచిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తన్విత ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. మరోవైపు తన్వితతో పాటు ఇదే పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు కూడా అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నారు. సైన్స్ విభాగంలో తన్విత మొదటి స్థానంలో నిలవగా.. లక్ష్మి దుర్గ ప్రసన్న 450 మార్కులతో ద్వితీయ, గౌరీ శంకర్ 447 మార్కులతో తృతీయ స్థానాలను సాధించారు. అలాగే హ్యుమానిటీస్ విభాగంలో శెట్టి రాహిత్య 435 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థుల అద్భుత విజయ పరంపరపై ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రోని, లావణ్య, నాయుడు, లోవరాజు, హరిబాబు తదితర సిబ్బంది తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

## సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా చల్లంగి జ్ఞానేశ్వరి నియామకం.



**చింతపల్లి పెన్ పవర్ మే 14.** అరకు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు చల్లంగి జ్ఞానేశ్వరి ని సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యురాలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తెలుగుదేశం పార్టీలో నమ్మకంగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్నాను అన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న అన్నారు. తనపై నమ్మకం ఉంచి సింహాచలం బోర్డు సభ్యులుగా నియమించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు పార్టీ పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనందరావు, లక్కోజ్ నాగభూషణం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన స్వతంత్ర సమరయోధుల ప్రదర్శనశాల పనులను వేగవంతం చేయాలి



**పాడేరు, పెన్ పవర్, మే 14:**అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగి గ్రామంలో గిరిజన స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వం నిర్మిస్తున్న "గిరిజన స్వతంత్ర సమరయోధుల ప్రదర్శనశాల" (ఠతీఱఛ్రీ ఖీతీవవసశీఎ ఖీఱస్త్రష్ట్రవతీం వీబంవబఎ) పనులను గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సుధా భార్గవి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
డైరెక్టర్ మ్యూజియం నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి, బ్లాక్-1, బ్లాక్-2 లో జరుగుతున్న పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె పలు కీలక సూచనలు చేశారు.
నిర్మాణ నాణ్యత పనులపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మ్యూజియం నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలతో, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.
గిరిజన వీరుల పోరాట పటిమను నేటి తరానికి వివరించేలా అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీ, ఆడియో-విజువల్ ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని సూచించారు.
మ్యూజియం పరిశీలన అనంతరం అధికారులతో మాట్లాడుతూ, "దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన గిరిజన వీరుల చరిత్రను భావి తరాలకు అందించడమే ఈ ప్రదర్శనశాల ముఖ్య ఉద్దేశ్యమని, ఇక్కడ ఏర్పాటు చేసే ప్రతి శిల్పం, ప్రతి చిత్రం వారి పోరాట స్ఫూర్తిని రగిలించేలా ఉండాలి" అని అన్నారు.
ఈ పర్యటనలో పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, ఇతర సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, విజయవాడ నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీర్ వసంత, టీఆర్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాణి, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పీబీకే పరిమళ, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ రాజ్, చింతపల్లి ఏఈ యాదవ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఏ.పీ.ఆర్.ఎస్ లో రాష్ట్రస్థాయిలో మెరిసిన "ఆశిష్"



**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** కోటబొమ్మాళి మండలం సింహాద్రిపురం కు చెందిన బర్ల ఆశిష్ గురువారం విడుదలైన ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ 6వ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 3 వ ర్యాంక్ (93/100) సాధించాడు. రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించి పాఠశాల పేరును రాష్ట్రస్థాయిలో ఇనుముడింపజేసినందుకు

కోటబొమ్మాళి ఎం.ఈ.ఓ డబ్బీరు గోవిందరావు ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణ రావు, ఎస్.ఎం.సి ఛైర్మెన్ రాజాపు జయమ్మ, సి. ఆర్. పి బొడ్డాపు శ్రీనివాసరావు, తల్లిదండ్రులు సుందరరావు, తేజోవతి అభినందించారు. ఈ సందర్భంగా ఆశిష్ కు మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోవిందరావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించగలరని ఆశిష్ నిరూపించాడని కొనియాడారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చదివించే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ర్యాంకులు సాధించగలవని ఆయన స్పష్టం చేశారు.

## యం.జే.పి ప్రవేశ పరీక్షలో న్యూ బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ



**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** మహాత్మా జ్యోతిబాపులే జూనియర్ కళాశాలలో ప్రవేశం కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల కాగా టెక్కలి న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని డైరెక్టర్ దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు తమ్మినేని సాయికుమార్ యం.పి.సి విభాగం లో 87.05 మార్కులతో జిల్లా 2వ ర్యాంక్ , ఇసంపల్లి తనీష్ జిల్లా 21వ ర్యాంక్, తిమ్మల హేమలత 35వ ర్యాంక్, తామాడ మీనాక్షి 36వ ర్యాంక్, గురుగుబెల్లి యామిని 41వ ర్యాంక్, బస్వ కావ్యశ్రీ 47వ ర్యాంక్, దాసరి రాకేష్ 64 వ ర్యాంక్, బత్తిన అలేఖ్య 62వ ర్యాంక్, బొడ్డు భారతి 83 వ ర్యాంక్ సాధించారు. అలాగే బై.పి.సి విభాగం లో కీలు సాయి 61.25 మార్కులతో జిల్లా 8వ ర్యాంక్, తామడ ఝాన్సీ 20వ ర్యాంక్, పేడాడ జ్యోత్స్న 36వ ర్యాంక్ సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు

# ?గిరిజన స్వతంత్ర సమరయోధుల ప్రదర్శనశాల పనులను వేగవంతం చేయాలి.



గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సుధా భార్గవి.

**చింతపల్లి పెన్ పవర్ మే 14.**

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగి గ్రామంలో గిరిజన స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వం నిర్మిస్తున్న గిరిజన స్వతంత్ర సమరయోధుల ప్రదర్శనశాల పనులను గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీమతి సుధా భార్గవి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

డైరెక్టర్ మ్యూజియం నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి, బ్లాక్ 1, బ్లాక్ 2 లో జరుగుతున్న పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో, కాంట్రాక్టర్స్, సంబంధిత అధికారులతో కలిసి పవర్ పాయింట్ ప్రాజెంటేషన్ ద్వారా పనుల కు సంబంధించిన పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె పలు కీలక సూచనలు చేశారు.

నిర్మాణ నాణ్యత పనులపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మ్యూజియం నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలతో, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆదేశించారు.


గడువులోగా పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

సాంకేతికత వినియోగం, గిరిజన వీరుల పోరాట పటిమను నేటి తరానికి వివరించేలా అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీ, ఆడియో-విజువల్ ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని సూచించారు.

మ్యూజియం పరిశీలన అనంతరం అధికారులతో మాట్లాడుతూ ?దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన గిరిజన వీరుల చరిత్రను భావి తరాలకు అందించడమే ఈ ప్రదర్శనశాల ముఖ్య ఉద్దేశ్యమని, ఇక్కడ ఏర్పాటు చేసే ప్రతి శిల్పం, ప్రతి చిత్రం వారి పోరాట స్ఫూర్తిని రగిలించేలా ఉండాలని

పర్యటనలో పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, ఇతర సిబ్బందికి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఐటిడి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, చీఫ్ ఇంజనీర్ వసంత, టి ఆర్ ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాణి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పిబికె పరిమళ, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవిడ్ రాజ్, చింతపల్లి ఎఈ యాదవ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




## పదవ తరగతి లో విఫలమైన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి.

- జిల్లా విద్యాశాఖ అధికారి రావు కృష్ణారావు.




**చింతపల్లి పెన్ పవర్ మే 14.** పదవ తరగతిలో విఫలమైన( ఫెయిల్ ) విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి రావు కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన చింతపల్లిలో పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజులు యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు అయ్యేటట్లు చూడాలని సూచించారు. 156 మంది విద్యార్థులకు గాను 151 మంది విద్యార్థులు హాజరు కావడంతో ప్రధానోపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హాజరైన విద్యార్థులందరికీ పరీక్షలలో రాయవలసిన మెలకువలను, పాఠ్యాంశాలను చక్కగా బోధించాలని సూచించారు. సప్లమెంటరీ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పనసల ప్రసాద్, బోడం నాయుడు, ప్రధానోపాధ్యాయులు రామరాజు పడాల్, వెంకటరమణ, కిల్లంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బుర్సింగిలో ఉచిత ఐ క్యాంప్, మెడికల్ క్యాంప్ నిర్వహణ




**చింతపల్లి,పెన్ పవర్,మే 14:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొత్త పాలెం పంచాయతీ బుర్సింగి గ్రామంలోని ఐఎంఎస్ చర్చి వద్ద ఈ నెల 15వ తేదీన ఉచిత ఐ క్యాంప్ మరియు మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పాస్టర్ కోరేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాస్టర్ జాన్సన్, కీర్తన సహకారంతో జీసస్ ట్రూ లవ్ మరియు వాసన్ ఐ కేర్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

## వికసించిన “మే” పుష్పం.



**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** కోటబొమ్మాలి మండల కేంద్రం లో విశ్రాంత ఉపాధ్యాయులు సామ సంజీవరావు ఇంటి వద్ద “మే” పుష్పం వికసించింది. ఇది కేవలం ఒక “మే” నెలలోనే వికసిస్తుందని అందువల్లనే దీనిని “మే” పుష్పం అని పిలుస్తారు. ఇది గులాబీ ఎరుపు రంగులో చూడముచ్చటగా ఉంటూ దీని కాండం కూడా కాడల్లా కనిపిస్తాయి. ఇది దుంప జాతికి చెందిన మొక్క. ఈ పుష్పం అరుదుగా కనిపిస్తుంది. చుట్టుపక్కల వారు వచ్చి వింతగా పరికిస్తున్నారు. ఏడాది పొడవునా దీన్ని పోషిస్తే కేవలం ఒక్క నెలలోనే ఈ పుష్పం దర్శనం ఇస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు సంజీవరావు తెలిపారు.

## మారుమూల గ్రామాల్లో ఎస్సై సాయిరాం పడాల్ పర్యటన



- మహిళల భద్రతకు అందరూ అప్రమత్తంగా ఉండాలి
- గంజాయి, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన

**జి.మాడుగుల, పెన్ పవర్ మే (12)**మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ, గంజాయి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జి.మాడుగుల ఎస్ఐ సాయిరాం పడాల్ అన్నారు. మండలంలోని కిల్లంకోట పంచాయితీ పరిధిలోని మారుమూల గ్రామాలు గొడ్డలికర్ర, రోలుగుంట, బూరెలపనుకు గ్రామాలను మంగళవారం ఆయన సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలు, జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్ఐ సాయిరాం పడాల్ మాట్లాడుతూ.. మహిళలపై వేధింపులు, బాల్య వివాహాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి రవాణా, వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు నమ్మి వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని తెలిపారు. అలాగే ఐవీఆర్ఎస్ కాల్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిడుగు పడి మూడు పశువులు మృతి

**జి.మాడుగుల, పెన్ పవర్ మే (14)**మండలంలోని సింగర్భ పంచాయితీ కంబాలబయలు గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి పిడుగు పడి మూడు పశువులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కిముడు బొజ్జచారికి చెందిన రెండు ఆవులు, కొమ్మంగి మత్యలింగంకు చెందిన ఒక ఆవు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. వర్షం సమయంలో పశువులు మేత కోసం వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కసారిగా పిడుగు పడటంతో పశువులు కుప్పకూలిపోయాయని చెప్పారు. దీంతో పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



## అమ్మవారు ఉత్సవాలు పేరుతో కూటమి నాయకుల కుట్ర : ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు



**పాడేరు, పెన్ పవర్, మే 14:**అమ్మవారు ఉత్సవాలు పేరుతో కూటమి నాయకులు కుట్ర చేస్తున్నారని, నిన్న మంత్రి నారా లోకేష్ పాడేరు పర్యటన వివాహానికా లేదా ప్రభుత్వ కార్యక్రమానికా అని శాసన సభ్యులు, అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ప్రశ్నించారు. తప్పుడు సమాచారం ఇచ్చి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న కూటమి నాయకుల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.

బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఉత్సవాలు ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఆలయ కమిటీ మరియు గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకుల సమక్షంలో నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అయితే కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి ఆ తేదీల్లో ఉత్సవాలు నిర్వహించలేమని, పక్క రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నందున పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వలేమని చెప్పి, ఎప్పుడూ లేనివిధంగా ఇన్‌చార్జి మంత్రి కలుగజేసుకుని పండుగ తేదీలు మార్పులు చేసి అమ్మవారు ఉత్సవాలను రాజకీయంగా మార్చేశారని ఆరోపించారు.

నిన్న టీడీపీ నాయకుడి వివాహానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎలా ప్రొటెక్షన్ ఇచ్చారని, మూడు రోజులు ముందుగానే ఇంత మంది పోలీసులు ఎక్కడి నుంచి వచ్చారని, ఎలా సాధ్యమైందో జిల్లా అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అలాగే నిన్న వివాహానికి 64 ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి నారా లోకేష్ మీటింగ్ ఉందని ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి, మీటింగ్‌కు రాకపోతే పెన్షన్ తొలగిపోతుందని, ఉపాధి హామీ కార్డులు రద్దు చేస్తారని చెప్పి మండల అధికారులు సామాన్య ప్రజలను బలవంతంగా తరలించారని ఆరోపించారు. వారికి కనీసం నీళ్ల ప్యాకెట్లు కూడా అందించని పరిస్థితి తీసుకొచ్చారన్నారు. మంత్రి పర్యటన వల్ల పాడేరు పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగి వాహనదారులు రెండు గంటల పాటు ఎండలో ఉండి కదలలేని పరిస్థితి ఏర్పడిందని, అత్యవసర సేవల అంబులెన్స్‌కు కూడా దారిలేని దుస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ, వైస్ ఎంపీపీ కుంతురు కనకాలమ్మ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ లకే రామసత్యవతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, గొండెలి ఎంపీటీసీ రాజేశ్వరి, మాజీ సర్పంచులు వంతల రాంబాబు, మినుముల కన్నపాత్రుడు, పాంగి నాగరాజు, సోమెలి లక్ష్మణ రావు, సీనియర్ నాయకులు మోద బాబురావు, పలసి కోటేశ్వర రావు, వంతల నరేష్, రాజేష్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సమస్యలపై పెసా కమిటీ వినతి

- జిల్లా కో-ఆర్డినేటర్‌కు వినతిపత్రం సమర్పణ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,మే 14:**పాడేరు నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పెసా సమావేశంలో గూడెంకొత్తవీధి మండలానికి చెందిన పెసా సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జీకే వీధి మండల పెసా ప్రతినిధులు జిల్లా పెసా కో-ఆర్డినేటర్ ఈశ్వర్‌ను కలిసి ప్రాంతీయ సమస్యలపై చర్చించారు. అనంతరం గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, స్థానిక వనరులపై ఆదివాసీల హక్కుల అమలు కోసం కమిటీ నిరంతరం కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జీకే వీధి మండల పెసా ఫోరమ్ అధ్యక్షుడు కొర్ర బలరాం, కోశాధికారి లకే రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ్, సభ్యులు రీమల కోటి, కె.మనోజ్, ఎం.వెంకటేశ్, అరడ గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

## అప్ హోల్డ్ ఎన్జీవో ద్వారా బోరుబావి ఏర్పాటు

- దిగువ కుమడలో మంచినీటి సౌకర్యానికి కృషి.
- ఆప్ హోల్డ్ ఎన్జీవో ప్రతినిధులను కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 14.** మండలంలో గల మారుమూల కుమ్మడ పంచాయతీ, దిగువ కుమడ గ్రామంలో అప్ హోల్డ్ ఎన్జీవో ద్వారా బోరు బావిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్ హోల్డ్ ఎన్జీవో ప్రతినిధులు గురువారం మాట్లాడుతూ.. గ్రామంలో మంచినీటి ఎద్దడి దృష్ట్యా గ్రామస్తుల, అధికారుల అంగీకారంతో బోరుబావిని ఏర్పాటు చేశామని, ప్రజల దాహార్తిని తీర్చడమే ఎన్జీవో యొక్క లక్ష్యం అన్నారు. గ్రామాలలో మంచి నీటి కల్పనకు ఎన్జీవో ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. సేవా దృక్పథంతో గ్రామంలో బోరు బావి ఏర్పాటు చేసిన అప్ హోల్డ్ ఎన్జీవో ప్రతినిధులకు పంచాయతీ మాజీ సర్పంచ్ ముక్తమ్మ, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసా ఉపాధ్యక్షులు చిరంజీవి, అప్ హోల్డ్ ఎన్జీవో ప్రతినిధులు కరుణ్, రాజేష్, కోటేశ్వరరావు, సుధాకర్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో క్రూర జంతువుల భయం...!

- కొయ్యూరు, చింతపల్లి, జికె వీధి, మండలాల్లో గిరిజనులలో పులి భయం...!



**కొయ్యూరు,పెన్ పవర్ మే 14 :**కొయ్యూరు మండలానికి కూతవేటి దూరంలో ఉన్న రాజవొమ్మంగి మండల పరిసర ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తూ మూగజీవాలపై దాడి చేసి ప్రజలను భయాందోళన చేస్తుంది.

అలాగే గతవారం చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీ బంధభైలు లింగాలగుడి చెరుకుంపాకలు పరిసరాల ప్రాంతాలలో గత వారం రోజుల నుండి క్రూర జంతువు మేక పిల్లలను పట్టుకుని వెళ్లిపోతున్నాయని ఈ ప్రాంత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.


దీంతో ఫారెస్ట్ అధికారులు చింతపల్లి మండల పరిసర గ్రామాలను సందర్శించి క్రూర జంతువుల నుండి అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, చేనుల్లోకి ఒంటరిగా వెళ్ళొద్దని మీకు ఎటువంటి క్రూర జంతువులు కనిపించిన వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియపరచాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

## అడివివరం ప్రభుత్వ నర్సరీని పరిశీలించి, పలు సూచనలు చేసిన మొల్లి పెంటిరాజు



**గాజువాక ఆ;పెన్ పవర్ ,మే 14 :**విశాఖ జిల్లా పర్యటన సందర్భంగా, సింహాచలం అడవివరం వద్ద ఉన్న ప్రభుత్వ నర్సరీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ హోదాలో సందర్శించారు . సింహాచలం అడివివరం ప్రాంతంలో సుమారు 40 ఎకరాల ప్రాంతంలో ఉన్న ఈ నర్సరీని గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నడుస్తుంది. విశాఖ గూగుల్ డేటా సెంటర్ ను అడవివరం వద్ద, ఈ ప్రాంతంలో నిర్మాణం చేపట్టడం వల్ల ఈ నర్సరీని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషేక్ కిషోర్ కూడా సందర్శించి, వేరే ప్రాంతానికి ఈ నర్సరీని తరలించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో ఉన్న మొక్కలను పుష్పాల మొక్కలు, అలంకరణ మొక్కలు, డెకరేషన్ చెట్లను పరిశీలించి, నీటిని ప్రతిరోజు మొక్కలకు అందించాలని, క్రిమిసంహారిక రసాయనాలు చల్లి వాటిని సంరక్షించాలని, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ప్రాజెక్టు అధికారి శివ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

### శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తురాలి బంగారు హారం విరాళం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 14** :విశాఖపట్నానికి చెందిన కరాశ వాస్తవ్యులు వి. పరదేశమ్మ నేటి ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి లో అమ్మవారికి సుమారు 23 గ్రాముల బంగారు నెక్లెస్‌ను భక్తిశ్రద్ధలతో సమ ర్పించారు. ఈ ఆభరణం విలువ సుమారు రూ .2.45 లక్షలు ఉంటుందని దేవస్థాన అధికారు లు తెలిపారు.ఈ కార్యక్రమం దేవస్థానం కార్య నిర్వాహణాధికారి కే. శోభారాణి మరియు ధర్మకర్తల మండలి చైర్మన్ కందుల నాగరాజు సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది. అనంతరం దేవాలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం అందజే శారు. అలాగే భక్తురాలికి శేషవ స్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**"వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 14 :** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల సహకా రం, అధికారుల సమన్వయంతో శాశ్వతంగా పరిష్కరించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం టి. నగరంపాలెం గ్రామంలో గురువారం నిర్వహిం చిన రెవెన్యూ వేదికలో ఆయన పాల్గొని గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామా ల్లోని భూ, రెవెన్యూ మరియు ఇతర ప్రజా సమ స్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ నెలలో రెవెన్యూ శాఖ అధి కారులు గ్రామాన్ని నాలుగు సార్లు సందర్శించి ప్రతి సమస్యపై ప్రత్యేకంగా పరిశీలన నిర్వహి స్తారని తెలిపారు. అధికారులు గ్రామానికి వచ్చి సమయం కేటాయిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామస్తులు సమర్పించిన ప్రతి వినతిపై ఫీల్డ్ ఎంక్వయిరీ నిర్వహించి, పరిష్కారం సాధ్యమైన అంశాలు, సాధ్యం కాని అంశాలపై వచ్చే వారం లో స్పష్టత ఇస్తామని కలెక్టర్ వెల్లడించారు. నాలుగో వారంలో గ్రామానికి సంబంధించిన మొత్తం సమస్యలు, పరిష్కరించిన అంశాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వాటి కారణా లను ప్రజలకు వెల్లడిస్తూ కార్యక్రమాన్ని ముగి స్తామని చెప్పారు.గ్రామ సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు ఇప్పటికే సేవలు అందిస్తున్నప్పటికీ, ముఖ్యంగా రెవెన్యూ సంబం ధిత సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. పర స్పర సహకారం, అవగాహనతో చాలా సమస్య లు సులభంగా పరిష్కరించవచ్చున్నారు.

ప్రతి సర్వే నంబర్‌ను అధికారులు పరిశీలిస్తున్న సమయంలో గ్రామస్తులు పూర్తి సహకారం అం దించాలని కోరిన కలెక్టర్, గ్రామానికి వెలుపల ఉన్న భూస్వాములు, సంబంధిత వ్యక్తులకు ముందుగానే సమాచారం ఇచ్చి సర్వే సమయం లో హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే సమస్యలకు శా శ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాథుర్, తహశీల్దార్ రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాహన చోదకులకు... పోలీసులు అవగాహన...!



**రోడ్డు భద్రత నియమావళి తప్పనిసరిగా పాటించాలి సీఐ శ్రీనివాస్**

**కొయ్యూరు, పెన్ పవర్ మే 14:** రోడ్డు భద్రత నియమావళి తప్పనిసరిగా పాటించాలని కొయ్యూరు సీఐ శ్రీనివాస్ ఎస్సై కిషోర్ వర్మ సూచించారు. గురువారం మండలంలోనిచింతలపూడి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతా నియమాలపై విస్తృతంగా కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్, ఎస్సై కిషోర్ వర్మ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వలన జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని ఈ సందర్భంగా గ్రామస్తులకు తెలియజేశారు.

అలాగే గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను తీసుకువెళ్లరాదని, ఓవర్‌లోడింగ్ చేయడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఇతర వాహన సంబంధిత పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ సంకేతాలు మరియు పోలీసుల సూచనలు తప్పనిసరిగా అనుసరించాలని ప్రజలకు వివరించారు.

పశువుల యాజమానులు తమ పశువులను రోడ్లపై విడిచిపెట్టరాదని ప్రత్యేకంగా సూచించారు. రోడ్లపై సంచరించే పశువుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పశువులను రోడ్లపై నిర్లక్ష్యంగా వదిలిన యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కృష్ణాపురంలో ఉచిత వైద్య శిబిరం




**చింతపల్లి,పెన్ పవర్,మే 14**:మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.మడిగుంట, చింతలూరు జంక్షన్, లబ్బరుగొంది, పెద్దగొంది, సిరిపురం, పెద్దబరడ, భీమానాపల్లి గ్రామాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు.విశాఖపట్నానికి చెందిన వాసన్ ఐ కేర్ సహకారంతో, జీసస్ ట్రూ లవ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. స్థానిక పాస్టర్ జి. చెల్లారావు సమన్వయంతో రోగులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

## తాగునీటీ సమస్య పరిస్కారము చేయండి?



**అరకులోయ పెన్ పవర్ 14:**మండలం బస్కి పంచాయితీకి చెందిన కంజారితోట గ్రామంలో ఈ రోజు గిరిజన సంఘం, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంచినీటి సమస్య పరిష్కారం చేయాలనీ ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్బంగా బస్కి మాజీ ఎంపీటీసీ బురిడీ.దశరద్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా త్రాగు నీరందించండి.అని పలు రకాలుగా ఆందోళనలు చేస్తున్న గ్రామస్తుల బాధలు పట్టించుకొనే నాడుడేలేదు. గత నెలలో ధర్నా చేస్తే జ్జమ్ నిధులు నుండి బోరింగ్ వేసి మోటర్ బిగించి నెలరోజులు అవుతున్న ఇప్పటి వరకు మిగిలిన పనులు ప్రారంభించలేదు.దీని గురించి మండల జే ఈ కాంట్రక్టర్ ను సంప్రదిస్తే మాకు ప్రభుత్వం నుండి బిల్లులు చెల్లించలేదు. మేమేం చేయలేము.మేము విజయవాడ ధర్నా చేస్తున్నాము అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాలని, లేని యెడల పంచాయితీ కార్యాలయం ముట్టడిస్తామని తెలియజేస్తున్నాము..ఈకార్యక్రమంలో గ్రామస్తులు కొర్ర. సుబ్బారావు, గెమ్మెలి.చిన్నం నాయుడు, కొర్ర.సీతన్న, గేమ్మిలి.రాంబాబు,గెమ్మెలి. రాంబాబు, పార్వతి, లక్ష్మి, రామి, సావిత్రి, రత్నం తదితరులు పాల్గొన్నారు..

## ఈనెల 20న రంపచోడవరంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం

- అల్లూరు జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ వెల్లడి




**కొయ్యూరు, పెన్ పవర్ మే 14:**ఈనెల 20న ఉమ్మడి అల్లూరి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సమావేశం రంపచోడవరంలో నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ తెలిపారు. రంపచోడవరం లో 20 తేది బుధవారం నిర్వహించే ఈ సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ సిపిఐ పార్టీ సమితి సభ్యులు జెవి సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ సమితి సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరై సమితి సమావేశాన్ని విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి



**టెక్కలి, పెన్ పవర్ మే 14 :** టెక్కలి నియోజకవర్గం నందిగాం మండలం కొండ తెంబూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి ఒడిస్సా వైపు కూరగాయలు లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొనడంతో పైనుంచి వ్యతిరేక దిశలో ఉన్న రోడ్డు పైకి దూసుకుపోయింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన క్లీనర్ ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వాహనాలను సురక్షిత ప్రాంతానికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రైతులు స్వచ్ఛందంగా రూ.2 కోట్లతో రెగ్యులేటరీ నిర్మాణ పనులు





**పెన్ పవర్. మే 14:**తోకలపల్లి ప్రధాన మురుగు కాలువపై రావులపురం వద్ద రైతులు స్వచ్ఛందంగా రెగ్యులేటరీ నిర్మాణ పనులు చేపట్టారు. నిడమర్రు మండలంలో పత్తేపురం, బైనేపల్లి, ఆముదాలపల్లి, తోకలపల్లి తదితర ఆరు గ్రామాల ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు అధిగమించేందుకు తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ నిధుల కోసం నిరీక్షించకుండా, తమ సొంత ప్రయోజనాలను పక్కన పెట్టి సామూహిక ప్రయోజనం కోసం రైతులు రూ.2 కోట్ల భారీ వ్యయంతో ప్రధాన మురుగు కాలువపై రెగ్యులేటర్ నిర్మాణానికి ముందుకు రావడం విశేషం. ఈ రెగ్యులేటర్ నిర్మాణానికి ఈ నెల 13న ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు.

సాధారణంగా ఏ చిన్న అభివృద్ధి పని జరగాలన్నా ప్రభుత్వాన్ని ఆశ్రయించడం పరిపాటిగా మారింది. అయితే ఈ ప్రాంత రైతులు భిన్నంగా ఆలోచించారు. ప్రధాన మురుగు కాలువ ద్వారా వచ్చే నీటిని సక్రమంగా వినియోగించుకోవడం, అలాగే వరద సమయంలో పంట ముంపును నివారించడం కోసం రెగ్యులేటర్ నిర్మాణం తప్పనిసరి అని గుర్తించి ముందడుగు వేశారు. ఇరిగేషన్ శాఖలో నిధుల కొరత కారణంగా రైతులు స్వచ్ఛందంగా ఈ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు.

స్వచ్ఛంద విరాళాలు

నిడమర్రు మండలంలోని ఆరు గ్రామాల ఆక్వా రైతులు, సన్నకారు, చిన్నకారు రైతులతో సహా అందరూ కలిసి దాదాపు రూ.2 కోట్లు సేకరించనున్నారు.

భద్రత -- ఆర్థిక పురోగతి

ఈ రెగ్యులేటర్ నిర్మాణం పూర్తయితే ఆ ప్రాంత రైతులకు బహుళ ప్రయోజనాలు కలగనున్నాయి.

నీటి నిల్వ

ఎండాకాలంలో సాగునీటి ఎద్దడి రాకుండా కాలువలో నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

ముంపు నివారణ

భారీ వర్షాలు కురిసినప్పుడు అదనపు నీటిని నియంత్రించడం ద్వారా వేల ఎకరాల పంట పొలాలు ముంపునకు గురికాకుండా కాపాడుకోవచ్చు.


తోకలపల్లి ప్రధాన మురుగు కాలువ ద్వారా నిడమర్రు మండలంలోని ఆరు గ్రామాలకు తాగునీరు, సాగునీరు కీలకంగా ఉంది. ప్రజా భాగస్వామ్య ౹ాబఎశ్రీఅఽ ౹ఖతీఅఽఅజూ్ఖఅశీఅ) పద్ధతిలో రైతులంతా ఎకరానికి కొంత చొప్పున స్వచ్ఛందంగా విరాళాలు పోగేసి, ఇరిగేషన్ అధికారుల పరిరక్షణలో ఈ రెగ్యులేటర్ నిర్మాణాన్ని 40 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం అభినందనీయం.

ఈ పనులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్ఫూర్తి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తే సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు రావడం ఖాయమని రైతులు అభిప్రాయపడుతున్నారు. నిర్మాణ పనులు, డిజైన్ తదితర అంశాలు ఇరిగేషన్ శాఖ యంత్రాంగం ఆధ్వర్యంలోనే జరగనున్నాయి.

-- పత్సమట్ల ధర్మరాజు
ఉంగుటూరు ఎమ్మెల్యే

## తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ నూతన కమిటీ ఎన్నిక







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే 14:**అంతర్జాతీయ లయన్స్ తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ 2026.27 కు గాను నూతన కమిటీ ప్రకటించారు.. అధ్యక్షులు గా లయన్ చెన్నా రెడ్డి సతీష్ కార్యదర్శి లయన్ ఎస్వీఎస్ సత్తిబాబు ట్రెజరర్ గా లయన్ కాళ్ల గోపి కృష్ణ ఎంపిక అయ్యారు. క్లబ్ వివిధ ఛైర్ పర్సన్స్ గా లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు లయన్ మద్దూకూరి మెహర్ ప్రసాద్ లయన్ కొప్పిశెట్టి రమణయ్య లయన్ కోనా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గా లయన్ మానేపల్లి వెంకట సునీల్ కుమార్ లయన్ వేగేశ్న రామరాజు,అడ్మిన్ లయన్ ఇంద్రవాణి,డైరెక్టర్స్ గా గొర్రెల శ్రీధర్, కోనా శ్రీనివాస్. గన్నమని దొరబాబ, జొన్నల సతీష్, యర్రా నవీన్ కుమార్, కె వి బాబు, కోటి విజయ్ కిషోర్, అంబికా కొత్త సుభద్ర, డ్రా. నూకల దుర్గ తదితరులు ఎంపిక అయ్యారు. పూర్తి కమిటీ జులై 1 వతేది న ప్రకటించడం జరుగుతుంది అన్నారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అనేక క్లబ్స్ ద్వారా సేవలు అందిస్తూ ప్రజలలోసుస్థిర పేరు సంపాదించడం లయన్స్ 316జి జిల్లా లో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ప్రాముఖ్యత అందరికి తెలిసిందే అని నూతన కమిటీ ఉత్సాహం గా మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు..

# నూతన పశువైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మే14 ;** ఎలా నీ నో కారణంగా పాడిపశువులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం జీలుగుమిల్లిలో నూతన పశు వైద్యశాలను ప్రారంభించి, రైతులకు 50% సబ్సిడీపై పశువుల దాన పంపిణీ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ పాల ఉత్పత్తి తగ్గకుండా పశువుల వ్యాధులకు గురికాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. పశువులకు త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఉపాధి హామీ పథకంలో తొట్టెలు, గోకులం షెడ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా బిజెపి కార్యదర్శి చాత్రాతి ప్రసాదు, చిరి కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 16న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 14:**తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూరల్ కలెక్టరేట్ ప్రాంగణంలో మే 16వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష బుధవారం తెలిపారు.

ఈ జాబ్ మేళాలో లైన్ స్పియర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, రవళి స్పిన్నర్స్, ఠాగూర్ లాబొరేటరీస్, అవంతి ఫ్రోజన్ ఫుడ్స్, కియా మోటార్స్, లార్సెన్ అండ్ టర్బో, ఆకాశం హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్, మెడ్‌ప్లస్ టీమ్‌లీజ్ సంస్థలలోని పలు విభాగాలకు సంబంధించిన పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, ఎంబీబీఎస్, ఫార్మసీ, నర్సింగ్ ఎంబీఏ పూర్తి చేసిన, అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 32 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకుని, రెజ్యూమే, ఆధార్ కార్డు మరియు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.


మరిన్ని వివరాలకు 95332 21189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి శిరీష తెలిపారు.

# జగ్గంపేట నియోజకవర్గం లో బిజెపి బలోపేతమే లక్ష్యంగా ఇన్చార్జిల నియామకం.










రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు.

**గోకవరం పెన్ పవర్ మే 15:**--జగ్గంపేట నియోజకవర్గం లో భారతీయ జనతాపార్టీ మరింత బలమైన శక్తిగా నిలపడమే ధ్యేయంగా నీ మండల ఇన్చార్జి ల నియామకం జరగడం హర్షించ దగ్గ విషయమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టం మంగరాజు తెలిపారు. ఎంతో నిబద్ధత క్రమశిక్షణతో పార్టీకి పనిచేసిన సీనియర్ నాయకుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ నియామకం జరిగినట్లు పలువురు తెలిపారు. జగ్గంపేట మండలానికి బిజెపి సీనియర్ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు, గండేపల్లి మండలానికి సత్తి వెంకటరెడ్డి, కిర్లంపూడి మండలానికి కోనావెంకట సురేష్, గోకవరం మండలానికి కామినేని జయశ్రీ లను ఇన్చార్జులుగా నియమిస్తూ జిల్లా పార్టీ నిర్ణయం తీసుకుందని మట్ట మంగరాజు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు ఆయా మండలాలలో గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను నియమించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని గ్రామస్థాయిలో పార్టీ బలపడితేనే ఎన్నికలలో మంచి ఫలితాలు వస్తాయని గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని మట్ట మంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా గోకవరం మండల బిజెపి అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, బిజెపి సీనియర్ నాయకులు బత్తుల వెంకన్న బాబు, భారతీయ జనతా పార్టీ గోకవరం మండల మాజీ అధ్యక్షులు ముక్క శ్రీను, కాకి మణికంఠ,అడపా దొరబాబు,ముప్పిడి నాగేశ్వరరావు, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప,ఉంగరాల ఆదివిష్ణు తదితరులు మాట్లాడుతూ ప్రియతమ నాయకులు మట్ట మంగరాజు నాయకత్వంలో జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం మండలంలో బిజెపి బలోపేతానికి సైనికుల్లాగా పని చేస్తామని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయడమే మా కర్తవమని నూతనంగా నియమించబడ్డ నాలుగు మండలాల అధ్యక్షులు మీడియాకు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వాహనదారులకు జైలు, జరిమానా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 14:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఉత్తర్వులు ప్రకారము, రాజమహేంద్రవరం ట్రాఫిక్ డిఎస్పి వై.శ్రీకాంత్ సారధ్యంలో నగరం లో రోడ్ ప్రమాదాలను తగ్గించాలని ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో, త్రాగి వాహనం నడుపుతున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 49 కేసులను నమోదు చేసారు. వాహన తనిఖీలలో భాగంగా, తాగి వాహనం నడిపిన వాహనదారులకు, ఒకటవ అదనపు జ్యూడిషల్ రెండవ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ నందు పి ఈశ్వరి కోర్టులో49 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు శిక్ష విధించారు.

9 కేసులలో జైలు శిక్ష విధించినారు. 40 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ. 4,00,000 జరిమానా విధించారు.

## 2027 గోదావరి పుష్కరాలకు ప్రతిష్టాత్మక ఏర్పాట్లు



- భక్తులకు అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు
- కొవ్వూరు పరిధిలో సియుఎంటీఏ సాంకేతిక బృందం పర్యటన

**కొవ్వూరు, పెన్ పవర్, మే 14:**జిల్లాలో 2027 గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దిశగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు క్షేత్ర స్థాయిలో సమగ్ర చర్యలు చేపడుతున్నామని గోదావరి పుష్కరాల స్పెషల్ ఆఫీసర్ ఎన్.మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం గోదావరి పుష్కరాలు--2027 ఏర్పాట్లలో భాగంగా చెన్నై నుంచి వచ్చిన చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రత్యేక సాంకేతిక బృందం కొవ్వూరు పరిసర ప్రాంతాల్లోని పుష్కర ఘాట్లను పరిశీలించింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఎన్.మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచనల మేరకు పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తో కుంటా బృందం సమావేశం అవ్వడం జరిగింది అని తెలిపారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి ట్రాఫిక్, రవాణా, పార్కింగ్ తదితర అంశాలపై సియుఎంటిఏ బృందం జిల్లా యంత్రాంగంకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తుందని తెలిపారు. కొవ్వూరు పరిధిలో గోష్పాద క్షేత్రం, తాత్కాలిక బస్టాండ్, ట్రాఫిక్ డైవర్షన్ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, రైల్వే స్టేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర ప్రాంతాలను పరిశీలించి సాంకేతిక సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నెలరోజుల సమయం ఇవ్వడం జరిగిందన్నారు. ఘాట్ల వద్ద భద్రత, పారిశుధ్యం, త్రాగునీరు, రవాణా, వైద్య సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనులు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ బృంద సభ్యులు పూనం, రవిశంకర్, ప్రతిభ, రమేష్, కొవ్వూరు ఆర్డీవో కె.ఆనందరావు, డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పి.విశ్వం, ఎమ్మార్వో దుర్గా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రాన్స్ లో డబల్ డిగ్రీలు పట్టా పొందిన దాసరి తేజ



**గోకవరం పెన్ పవర్ మే 14 :-**మండలం తంటికొండ గ్రామానికి చెందిన ప్రముఖ టిడిపి నాయకులు దాసరి సీతారామకృష్ణ తనయుడు దాసరి వెంకట సూర్య తేజ ఫ్రాన్స్ (పారిస్)లో డబల్ డిగ్రీలు సాధించారు అని తన తండ్రి దాసరి సీతారాం తెలిపారు. మాస్టర్స్ ఆన్ మేనేజ్మెంట్ మరియు మాస్టర్స్ ఇన్ సైన్స్ స్ట్రాటజీ, ఆర్గనైజింగ్ కన్సల్టింగ్ డిగ్రీ పూర్తి చేశారు. తేజ గత మూడు సంవత్సరాలుగా ఫ్రాన్స్ (పారిస్) లిల్లీలో ఎడెక్ బిజినెస్ స్కూల్లో మాస్టర్ డిగ్రీ చేస్తున్న వెంకట సూర్య తేజ ఎంఐఎం(మాస్టర్స్ ఇన్ మేనేజ్మెంట్ ఎమ్మెస్సీ( స్ట్రాటజీ ఆర్గనైజేషన్ కన్సెప్టింగ్ ) పూర్తి చేశారు ఇంతకుముందు ఇండియాలో రిలయన్స్ ఓ సప్లై చైన్ మేనేజ్మెంట్ లో పనిచేశారు. ఎడెక్ బిజినెస్ స్కూల్ తరఫున మార్కెటింగ్ లో భాగంగా బీబీసీ ఛానల్ లో పాల్గొన్నారు.అదెక్ బిజినెస్ స్కూల్ తరుపున ఇండియన్ అంబాసిడర్ గా ,కాలేజీ రిప్రజెంటివ్ జర్నల్ ఆర్టికల్ రైటర్ గా పని చేసిన అనుభవం తేజకు ఉంది. ఎడెక్ బిజినెస్ స్కూల్ , ఫ్రాన్స్ ఇండియన్ స్టూడెంట్ బాడీ క్లబ్ ప్రెసిడెంట్, కెరీర్ సెంటర్ హెడ్ గా తేజ ఉన్నారు. తేజ డబల్ డిగ్రీలు సాధించడంపై తండ్రి దాసరి సీతారాం తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# అన్నా క్యాంటీన్లు పేదలకు వరం






- ఐదు రూపాయలకే భోజనం
- మండల కేంద్రాలకు విస్తరించాలని కోరుతున్న ప్రజానీకం

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ మే 14:**పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లు ఏజెన్సీ ప్రాంత పేదలకు పెద్ద ఊరటనిస్తున్నాయి. కేవలం ఐదు రూపాయలకే శుభ్రంగా, రుచికరమైన భోజనం అందించడంతో రోజువారీ పనుల నిమిత్తం జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చే నిరుపేద, గిరిజన కుటుంబాలకు ఇది ఆర్థిక భారం తగ్గించే మంచి అవకాశంగా మారింది.మారు మూల గిరిజన గ్రామాల నుంచి వివిధ అవసరాల కోసం రంపచోడవరం వచ్చే ప్రజలకు అన్నా క్యాంటీన్లు సమయానుకూలంగా భోజనం అందిస్తున్నాయి. నాణ్యమైన ఆహారం తక్కువ ధరకే లభిస్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా రాజవొమ్మంగి మండలానికి చెందిన లక్ష్మీ మాట్లాడుతూ, బయట భోజనం చేయాలంటే ప్రస్తుతం అధిక ఖర్చు అవుతోందని తెలిపారు. అయితే అన్నా క్యాంటీన్‌లో కేవలం ఐదు రూపాయలకే శుభ్రమైన, రుచికరమైన భోజనం అందుతుండటం పేదలకు ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే మంచి కార్యక్రమంగా అన్నా క్యాంటీన్లను అభివర్ణించారు.అలాగే రంపచోడవరం మండలానికి చెందిన శ్రీను మాట్లాడుతూ, రోజువారీ పనుల కోసం పట్టణానికి వచ్చే తమలాంటి వారికి ఈ క్యాంటీన్లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. భోజన ఖర్చుల భారం తగ్గుతుండటంతో కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా నిరుపేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందుబాటులోకి రావడంతో సామాజిక సంక్షేమానికి మరింత బలం చేకూరుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అన్నా క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాలి బాటల్లేక..పాదచారుల అవస్థలు



**ఏలూరు మే14 పెన్ పవర్ :** పట్టణాల్లో రహదారికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లకి అంతే ప్రాముఖ్యత ఉంటుంది.రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు ఇబ్బంలు లేకుండా,నడుచుకుంటూ వెళ్లే ప్రజలకు ఇబ్బందులు ఇబ్బందులు తలెత్తకుండా కాలిబాటలను నిర్మించాలి.కానీ ఏలూరు పగరం పరిధిలో నగర పాలక సంస్థ అధికారులు కాలిబాటలు నిర్మించక పోగా ఉన్నవి ఆక్రమణలకు గురైనా వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకోక పోవడంతో ప్రజల నుండి విమర్శలు వ్యక్తమౌతున్నాయి.రహదారి విస్తరణలో భాగంగా నగరంలోని ఆర్ఆర్ పేట రహదారికి ఇరువైపులా రూ.లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌లను నిర్మించారు.ఈ కాలిబాటలను కొందరు వ్యాపారులు రహదారికి ఇరువైపులా పలు చోట్ల ఆక్రమించేశారు.అయినా పట్టించుకునే వారే కరువయ్యారని స్దానికులు వాపోతున్నారు

మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో చాలా ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.దీంతో కాలిబాటలు లేక రోడ్లపైనే పాదచారులు నడవాల్సిన పరిస్దితి ఉంది.తోపుడు బండ్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పండ్ల వ్యాపారులతో పాటు ద్విచక్రవాహనాలు ,మినీ వ్యాన్లు,కార్లను రోడ్డుకు అడ్డంగా నిలిపి వ్యాపారాలు సాగిస్తున్నారు.నిత్యం ఇదే పరిస్దితి ఉన్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసే సిబ్బంది కానరావడంలేదని ప్రజలు వాపోతున్నారు

నగరంలో ఎక్కడెక్కడంటే

నగరంలో పవర్‌పేట ప్రధాన రహదారి,గోసంరక్షణ సమితి,ఫైర్‌స్టేషన్‌కు ఆను కొని ప్రధాన రహదారి వెంబడి పూల వ్యాపారస్తులు,టుటౌన్ ఫ్లైఓవర్ కు ఆనుకుని పవర్ పేట స్టేషన్‌కు వెళ్లే దారిలో,పండ్ల వ్యాపరస్తులు కాలిబాటల ఆక్రమణలతో రహదారుల ఆక్రమణలతో వాహనాల వాహనాలను నిలుపుతుండడంతో పాదచారులు నడువలేని పరిస్దితి

పవర్‌పేట ప్రధాన రహదారితో పాటు, రహదారి వెంబడి ఉన్న సందులలో ఆసుపత్రుల వద్ద,వ్యాపార సంస్దల వద్ద,రోడ్ల వెంబడి వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు రోడ్లపై నడవాల్సి రావడంతో వాహనాలు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజూ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

## లంబు సురేష్ బిజెపి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా



**కూనవరం,పెన్ పవర్,మే14.** బిజెపి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా లంబు సురేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని పార్టీ మండల అధ్యక్షులు కరక పవన్ కుమార్ తెలిపారు.సురేష్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలపడటానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నోముల రామారావు,ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఇందారపు ప్రసాద్ రావు,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సీనియర్ నాయకులు నోముల సత్యనారాయణ సొసైటీ డైరెక్టర్,జిల్లా కార్యదర్శి బొర్రా కామేశ్వరి,కుంజ సత్యనారాయణమ్మ,నామాల శ్రీనివాసరావు.ముత్యాల రాంబాబు,కారం సాగర్, సీనియర్ నాయకులు కురసం సుబ్బారావు,చింతూరు డివిజన్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.



తాడేపల్లిగూడెం జనసేన పార్టీ నాయకులు.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. మే 14.** తాడేపల్లిగూడెం నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు తాడేపల్లిగూడెం టౌన్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాడేపల్లిగూడెం న జనసేన నాయకులతో కలిసి తాడేపల్లిగూడెం సీఐ రవి కుమారు ఫేస్ బుక్ లో డిజిటల్ క్రియేటర్ నవీన్ కుమార్ గౌడ్ అనే ఐడి ఉన్నటువంటి వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో నవీన్ కుమార్ గౌడ్ అనే వ్యక్తి తరచూ జనసేన పార్టీ అధ్యక్షుల వారి పైన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు మరియు వ్యక్తిగతంగా విమర్శిస్తూ దుర్భాషలు చేస్తున్నాడనీ తెలియజేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో జనసేన బాహుబలి అంటే బొలిశెట్టి శ్రీనివాస్ అని, పేరుకు తగ్గట్టు నియోజకవర్గంలో అభివృద్ధి పనిలో ముందుండే వ్యక్తి అని తెలియజేశారు.సోషల్ మీడియాలో హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని, రాజకీయ విభేదాలు ఉండడం ప్రజాస్వామ్యంలో సహజం కానీ, ఒక వ్యక్తి నియోజకవర్గ అభివృద్ధి దిశగా ప్రజలకి మంచి చేయడం ఓర్వలేక సంస్కారహీనమైన రీతిలో ప్రవర్తించడం అక్షరాల నేరమని జనసేన నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి సురేష్,నీలపాల దినేష్ యాదవ్, పుల్లా బాబి,కేశవబట్ల విజయ్, అత్తిలి బాబి, బైనపాలెపు ముకేష్,మద్దాల నరసింహ,కొనకళ్ల హరినాథ్, కామిశెట్టి శ్రీనివాస్, అంగిన హరికృష్ణ, వాకా నాని, దంగేటి సత్యనారాయణ మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవీ మాల్ రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే 14:**తాడేపల్లిగూడెం పట్టణంలో జీవీ మాల్ రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపును మున్సిపల్ అధికారులు వేగవంతం చేశారు.

మున్సిపల్ కమిషనర్ ఎం. యేసుబాబు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది ఈరోజు జీవీ మాల్ రోడ్డులో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి నిర్మించిన గృహాలు, షాపులు, ఇతర నిర్మాణాలను గుర్తించి కొలతలు వేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం. యేసుబాబు మాట్లాడుతూ జీవీ మాల్ రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం విస్తరించేందుకు ఆక్రమణలు తొలగించడం అనివార్యమని తెలిపారు. రోడ్డు విస్తరణ వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు, వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆక్రమణల్లో ఉన్న గృహ యజమానులకు, వ్యాపారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన క్లియరెన్స్ ప్రక్రియ చేపడుతున్నామని వివరించారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకునేందుకు గడువు ఇస్తున్నామని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం తొలగింపు చర్యలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

## మేకల దొంగలున్నారు తస్మాత్ జాగ్రత్త





**వై రామవరం, పెన్ పవర్, మే 14**: అడ్డతీగల పోలీస్ సర్కిల్ పరిధిలో మేకల దొంగలు అధికంగా ఉన్నారని, యజమానులు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

వై రామవరం, అడ్డతీగల, గంగవరం మండలాల్లో ఇటీవల మేకల దొంగలు పెరిగిపోయారని స్థానికులు అంటున్నారు. ఏజెన్సీలో వేసవికాలంలో మేకలను, పశువులను కాపు కాయకుండా వదిలేయడం ఆనవాయితి గా వస్తుందన్నారు. ఇదే అదునుగా మేకలను దొంగలిస్తున్నారని అంటున్నారు. చవిటి దిబ్బలకు చెందిన గేదెల చిన్నబ్బాయికి సంబంధించిన నాలుగు మేకలను గత సంవత్సరం దొంగలించారని పోలీస్ కేసు పెట్టిన నేటి వరకు ఏ విధమైన ఆచూకీ లభ్యం కాలేదని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం ఒక మేకను,కోడిపుంజును దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అదేవిధంగా అడ్డతీగల మండలం పెద్ద ఒడిస్సా కర్ర గ్రామంలో ఈనెల మూడవ తేదీన పెళ్లి ఫంక్షన్కు తీసుకుని వచ్చిన మేకపోతు తప్పిపోయిందని నేటికీ దొరకలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గొర్రెలు కాపర్లు గొర్రెల మేపు కోసం వస్తుంటే దొంగలు గొర్రెలను దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. దొంగిలించిన మేకలను దర్జాగా మేదర్ల వద్ద కోయిస్తున్న ఏ విధమైన ఆచూకీ లభ్యం కావట్లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేయిస్తున్నారు. అదేవిధంగా కొందరు పశువులను కూడా అపహరించకపోతున్నారని తెలిపారు. ఏది ఏమైనా మేకల దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మూగజీవాలు అపహరణకు గురైన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని స్థానికులు కోరుచున్నారు.

## రోడ్ నిర్మించారు..బెర్మ్‌లు వదిలేశారు..



**ఏలూర పెన్ పవర్, మే 14**: నేటి బ్రహ్మాస్త్రం : కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధ ప్రాతిపదికన రహదారుల నిర్మాణాలు,మరమ్మతులు జరగడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.అంత వరకు బాగానే ఉన్నా..పలు చోట్ల రహదారి అంచుల్లో బెర్మ్‌లను బాగుచేయకుండా,బెర్మ్‌లను మట్టితో పూడ్చకుండా వదిలివేయడంతో ప్రాయాణీకులకు అవస్దలు తప్పడం లేదు.ఎదురెదుగా వాహనాలు వస్తున్నప్పుడు రోడ్డు పక్కకు వెళ్లాలంటే వాహపచోదకులు భయపడుతున్నారు.ముఖ్యంగా పెదపాడు మండలం కొత్తూరు నుండి పెదపాడు మీదుగా హనుమాన్ జంక్షన్ మార్గంలో ఈ పరిస్దితి అధికంగా ఉంది.ప్రధాన రహదారి నిర్మించి రోడ్డు అంచులను పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.గురువారం రాత్రి పెదపాడు నుండి ఏలూరు వస్తున్న ఓయువకుడు కొత్తూరు సమీపంలో -బాబూ ఖాన్ గూడెం వరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించడో రహదారి పక్కకు వెళ్లాడు.ఆ సమయంలో ఏయే ప్రాంతాల్లో.

కొత్తూరు నుంచి ముప్పర్రు మీదుగా వెంకటాపురం నుంచి పెదపాడు వేళ్లే రహదారి,కొత్తూరు నుండి బాబూఖాన్ గూడెం మీదుగా పెదపాడు హనుమాన్ జంక్షన్ వేళ్లే మార్గాల్లో రహదారి పక్కన అంచులు ప్రమాదకరంగా ఉన్నాయి.ఏ మాత్రం పక్కకు జరిగినా అదుపు తప్పి పడిపోయే పరిస్దితి లేక పోలేదు.ఈ సేపద్యంలో సంబందిత అధికారులు రహదారి పక్కనున్న ప్రమాదకర ప్రదేశాల్లోని మెర్మ్‌లను పటిష్టపరచాలని స్దానికులు,వాహన ప్రయాణీకులు కోరుతున్నారు.

## మురుగు ముందుకు కదలదు..



**ఏలూరు మే14 పెన్‌పవర్ :** దెందులూరు నియోజక వర్గం పెదపాడు మండలం పాత ముప్పర్రు గ్రామంలో అంతర్గత మురుగు కాలువ దెబ్బతిని మురుగుపా ముందుకు పారడం లేదు.డ్రైనేజీలలో మురుగు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని దోమల బెడదతో తరచూ అనారోగ్యానికి గురువుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ఇన్చార్జి కార్యదర్శి నూకరాజును సంప్రదించగా కాలువల్లో పూడిక తీయించి పరిసరాలు శుభ్రచేస్తామని,మురుగు కాలువల్లో రసాయనాలు స్ప్రే చేయించి,దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తామన్నారు. గ్రామంలో 800 మీ.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శాంక్షన్ అయిందని,నిధులు విడుదల కాగానే పనులు ప్రారభిస్తామన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com